


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 153 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 14 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 153 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 14 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## డీలిమిటేషన్ చాలా ప్రమాదకర దిశలో వెళ్తోంది

- ప్రమాదకర దిశలో డీలిమిటేషన్
- మహిళా రిజర్వేషన్లు ఆర్నెల్లలోనే అమలు చేయాలి
- హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలి
- అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి
- కేంద్రాన్ని డిమాండ్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళలకు రాజకీయ హక్కులు మొట్టమొదట కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొదట ఓటు హక్కు, తర్వాత రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించిందని చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీలిమిటేషన్‌పై ముఖ్యమంత్రి మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని ఎన్డీయే చూస్తోందన్నారు. కానీ, 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని చెప్పారు. ఈ రెండింటినీ కలపడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని ఆక్షేపించారు. 33శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు. ఈ రిజర్వేషన్లను ఆర్నెల్లలోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు."డీలిమిటేషన్ ప్రక్రియ చాలా ప్రమాదకర దిశలో వెళ్తోంది. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం జరిగేలా మోదీ కుట్ర చేస్తున్నారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయి. ఉత్తరాదిలో అది సరిగ్గా అమలు కాకపోవడం వల్లే జనాభా విపరీతంగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయి. దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ప్రతి రాష్ట్రంలో 50శాతం సీట్లు పెంచుతామని చెబుతున్నారు. ఇలా చేస్తే.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సీట్లు బాగా పెరగనున్నాయి. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుంది.సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో 195 లోక్‌సభ స్థానాలు అవుతాయి. ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయి. ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కి పెరుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కడం లేదు. కేంద్రంలోని కీలక శాఖలు ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదు.

మిగతా 2లో



## హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

- 2026-27 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక విద్యుత్ వినియోగం నమోదు
- సాయంత్రం 4,381 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదు
- గ్రేటర్ చరిత్రలో 2026 మార్చి 3న 4,421 మెగావాట్ల విద్యుత్ వినియోగం

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్ నగరంలో విద్యుత్ వినియోగం ఏప్రిల్ 13న రికార్డు స్థాయికి చేరుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీ

మిగతా 2లో



## రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం

- ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌కే అన్ని సీట్లు ఇవ్వాలా? అని ప్రశ్నించిన బండి సంజయ్
- రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి వాదనను రాజ్యాంగ విరుద్ధమని కొట్టిపారేశారు. "అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్నది రేవంత్ రెడ్డి వాదన. అదే నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లూ ఇవ్వాలా? వెనుకబడిన పాలమూరు, ఆదిలాబాద్ వంటి జిల్లాల పరిస్థితి ఏమిటి?" అని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నిధులు పంపి, ఇప్పుడు డబ్బు చుట్టూనే సిద్ధాంతాలు అల్లుతున్నారా? అని ఎద్దేవా చేశారు.బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను

మిగతా 2లో



## హర్మూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు

- ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్న మహమ్మద్ ఫతాలీ
- తమ డిమాండ్లకు అమెరికా అంగీకరిస్తేనే చర్చలు అన్న ఫతాలీ
- ఇరాన్ సామర్థ్యం గురించి అమెరికాకు తెలుసని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:హర్మూజ్ జలసంధి గుండా వెళుతున్న భారతీయ చమురు ట్యాంకర్ల నుంచి తాము ఎలాంటి టోల్ ఫీజును వసూలు చేయడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ రాయబారి

మిగతా 2లో

## తెలంగాణలో సమ్మె సైరన్.. ఏప్రిల్ 22 నుంచి ఆర్టీసీ సమ్మె




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో సమ్మె సైరన్ మోగింది. ఏప్రిల్ 22 నుంచి సమ్మె చేస్తున్నట్టు టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మార్చి 13నే సమ్మె నోటీసు ఇచ్చినా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని తెలిపింది. ఏప్రిల్ 21 అర్ధరాత్రి.. అంటే మొదటి డ్యూటీ నుంచే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్లు వెల్లడించింది. ఈ జేఏసీ వెనుక 40 వేల మంది కార్మికుల బలం ఉందని చెప్పారు జేఏసీ నేతలు. కార్మికులంతా ఏకతాటిపై ఉన్నారని... విభజించు పాలించు

మిగతా 2లో

## ఈ ప్రభుత్వం రైతుల కోసమా.. దళారుల కోసమా? కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు నిప్పులు

- సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీశ్ రావు
- రైతులు పంటను మద్దతు ధరకు అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన
- సీఎం, మంత్రులకు రైతుల బాధలు పట్టడం లేదని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:**పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందంటూ బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మిగతా 2లో

## మంగ్లీ వర్సెస్ అడ్వకేట్ సుబ్బారావు పంజాగుట్ట పోలీసుల కీలక వివరణ

- ఫైనాన్స్ స్కామ్ కు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్న సీఐ
- అడ్వకేట్ సుబ్బారావు మద్యం సేవించి వచ్చారని వెల్లడి
- టెస్ట్ చేస్తున్న సమయంలో హంగామా సృష్టించారన్న సీఐ



**హైదరాబాద్ పెన్ పవర్:** సింగర్ మంగ్లీ, అడ్వకేట్ సుబ్బారావు మధ్య కొనసాగుతున్న వివాదం పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్కంఠకు దారితీస్తోంది. ఈ కేసులో వస్తున్న వివిధ రకాల ఆరోపణలపై పంజాగుట్ట సీఐ రామకృష్ణ

మిగతా 2లో



## కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

- అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫోన్ల పంపిణీలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్
- సీతక్క కమీషన్లు తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో పోస్టులు
- 48 గంటల్లో పోస్టులు తొలగించాలంటూ కేసీఆర్‌కు సీతక్క నోటీసులు

మిగతా 2లో

## ఇటువైపు వస్తే నాశనమే

- దిగ్బంధనం షురూ.. ఇరాన్‌కు ట్రంప్ మరో వార్నింగ్
- ఇరాన్ ఓడరేవుల వద్ద నౌకలను అడ్డుకుంటున్న అమెరికా... సమీపానికి వస్తే ఇరాన్ నౌకలను పేల్చేస్తామన్న ట్రంప్
- ఇరాన్ నౌకలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు
- ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దళం దిగ్బంధం ప్రారంభం
- సమీపానికి వస్తే నౌకలను ధ్వంసం చేస్తామన్న ట్రంప్
- అంతర్జాతీయ జలాల్లో నౌకల కదలికలపై ఆంక్షలు విధించడం చట్టవిరుద్ధమన్న ఇరాన్

పెన్ పవర్ డెస్క్:పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్‌పై అమెరికా నావికా దళం పూర్తిస్థాయి దిగ్బంధాన్ని ప్రారంభించడంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా నేవీ మరిన్ని బలగాలను రంగంలోకి దించింది. ఇరాన్ ఓడరేవుల వద్ద వచ్చిపోయే నౌకలను అడ్డుకుంటోంది. తమ దిగ్బంధం సమీపంలోకి



మిగతా 2లో

## ఇక సెలవు.. ముగిసిన ఆశా భోస్లే అంత్యక్రియలు

**పెన్ పవర్ డెస్క్:** భారత సంగీత శిఖరం, లెజెండరీ సింగర్ ఆశా భోస్లే అంత్యక్రియలు ముగిశాయి. సోమవారం (ఏప్రిల్ 13) సాయంత్రం ముంబైలోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు. కుమారుడు ఆనంద్ భోస్లే తల్లి చితికి నిప్పంటించారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఆమిర్ ఖాన్ , విక్కీ కౌశల్, అనూప్ జలోటా, షాన్, వివేక్ ఒబెరాయ్ తదితర బాలీవుడ్, క్రీడా ప్రముఖులు,

మిగతా 2లో



## ఓట్ల తొలగింపుతో ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం

- న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలన్న సుప్రీంకోర్టు
- ఓటరు జాబితాలో కొనసాగే హక్కు ఓటరుకు ఉంటుందన్న సుప్రీంకోర్టు
- 'సర్' ప్రక్రియకు సంబంధించిన పిటిషన్లు ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నట్లు వెల్లడి

మిగతా 2లో






## వీడుతున్న ఆక్రమణల చెర

గ్రేటర్ హైదరాబాద్‌లో ఇటీవల ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రభుత్వం కొరడా ఝుళిపించడంతో నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విస్తరిస్తున్న నగరానికి తగ్గట్టుగా రహదారులు లేకపోవడంతోపాటు భారీగా వాహనాల పెరుగుదలతో హైదరాబాద్ ట్రాఫిక్ పద్మవ్యూహంలో ప్రజలు నిత్యం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగర ప్రజలు రద్దీ సమయాల్లో రోడ్లపై నడవాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్న కొన్ని ఫుట్‌పాత్‌లను కూడా చిరు, బడా వ్యాపారస్థులు కబ్జాలు చేయడంతో ఏమీ చేయలేక రోడ్డుపైనే నడుస్తూ ప్రయాణికులు ప్రమాదాలకు గురైన ఘటనలు నగరంలో అనేకం ఉన్నాయి. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం నగరం నలువైపులా ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాల తొలగింపుకు నడుం కట్టడంతో ప్రజలకు భారీ ఉపశమనం లభించనుంది. రాజకీయంగా, అధికారికంగా ఏ రూపంలోనైనా ఒత్తిడిలు వచ్చినా కబ్జాదారుల కబంధహస్తాల నుండి ఫుట్‌పాత్‌లను విముక్తి చేయాలి. వేగంగా అభివృద్ధి చెందుతూ మెట్రో నగరంగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ ఐటి, మౌలిక వసతులు, రహదారుల విస్తరణలో ముందంజలో ఉన్నా ఫుట్‌పాత్‌ల పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నాయి. దీంతో వేగంగా వెళ్లే వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా వృ ద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో నడక ప్రమాదకరంగా మారిపోయింది. ప్రతి సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌లో వెయ్యికిపైగా పాదచారుల ప్రమాదాలు నమోదవుతున్నాయి. ఉదాహరణకు 2024 గణాంకాలు పరిశీలిస్తే 400 మంది పాదచారులు ప్రమాదంలో మృతి చెందారు. 775 మంది గాయపడ్డారు. అంటే నగరంలో రోజుకు సుమారు 30 మందికిపైగా పాదచారులు రోడ్డు ప్రమాదాల బారీనపడుతున్నారు. ఈ ప్రమాదాలు అత్యధికంగా ఫుట్‌పాత్ సమస్యలతో ముడిపడి ఉండడం గమనార్హం. నగరంలో రహదారుల, ఫుట్‌పాత్ సమస్యలు పరిష్కరించడంలో భాగంగా వాటిని అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సుమారు మూడు వేల కోట్లకుపైగా రూపాయలు వెచ్చించి వెయ్యి కిలోమీటర్లకు పైగా రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది.

ఈ ప్రాజెక్టులో భాగంగా బిటి, సిసి రోడ్లతోపాటు ఫుట్‌పాత్‌లు, సెంట్ల్ మీడియన్లు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 700 కిలోమీటర్లకుపైగా రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు, అదనంగా 200 కిలోమీటర్లకుపైగా రోడ్లను ఎఫ్‌డిఆర్ సాంకేతికతతో పునర్నిర్మాణం చేయనున్నారు. వీటితోపాటు నగరం మొత్తం ఫుట్‌పాత్‌లను కూడా సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిహెచ్‌ఎంసి 2025 –26లో గుంతలు పూడ్చడంతోపాటు ట్రాఫిక్ భద్రతా చర్యలను చేపట్టింది. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు 24 లింక్ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ. 487 కోట్ల ప్రణాళికను అమలు చేస్తున్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యలకు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న కట్టడాలపై కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైన జిహెచ్‌ఎంసి ప్రతి వారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా నగరం నలువైపులా అక్రమ కట్టడాలను తొలగించేందుకు ముందుకొచ్చిన జిహెచ్‌ఎంసి ఏప్రిల్ 4వ తేదీన హైడ్రా, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకొని ఆరు జోన్ల పరిధిలోని 798 నిర్మాణాలను నేలమట్టం చేసింది. తొలగించిన వాటిలో 340 పూర్తిస్థాయి, 458 తాత్కాలిక నిర్మాణాలున్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సున్నితమైన పాతబస్తీతోపాటు కొన్ని చోట్ల ఉద్రిక్తతలు నెలకొన్నా అధికారులు సమన్వయంతో విజయవంతంగా అక్రమాలను తొలగించారు. ఇదే తరహాలో ఇకపై నగరవ్యాప్తంగా ప్రతివారం ఏదో ఒక ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని జిహెచ్‌ఎంసి అధికారులు ప్రకటించడంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నగర ప్రజలు ఇదే కోరుకుంటున్నారు.

చారిత్రాత్మకమైన హైదరాబాద్ నగరంలోని ప్రధాన మార్గాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు పలు సమస్యలకు కారణాలవుతున్నాయి. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకట్టుకునే చార్మినార్ పరిసరాల్లో వ్యాపారస్థులు పూర్తిగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పర్యాటకులు నడవలేని పరిస్థితి నెలకొంది. దక్షిణ హైదరాబాద్‌కు ముఖద్వారమయిన మూసీనదిపై నాటి నిజాం కాలంలో నిర్మించిన వంతెన ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ప్రస్తుతం పాతబస్తీలో మూసీ నదిపై ఉన్న వంతెనలన్నింటిలో 'నయాపూల్'గా పిలువబడే వంతెన ఎత్తైనది. భారీ వాహనాల ప్రయాణానికి అనువుగా నిర్మించిన ఈ వంతెనపై రిక్షాలు, సైకిళ్ల కోసం, పాదచారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. 2000 సంవత్సరం వరకు ఇదే తరహాలో ఉండేది. అయితే దురదృష్టవశాత్తు ఇప్పుడు భారీ వాహనాల మార్గం మినహాయించి రిక్షాలు, సైకిళ్లు, పాదచారులకోసం ఏర్పాటు చేసిన మార్గాలు పూర్తిగా తోపుడు బండ్లతో నిండిపోతున్నాయి. అక్కడ పాదచారులు భారీ వాహనాలు నడిచే మార్గంలోనే నడవాల్సి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇదే మార్గంలో ముందుకెళ్తే చారిత్రాత్మక కట్టడాలున్న మదీనా, గుల్జర్‌హౌజ్, చార్మినార్ మరింత క్లిష్ట పరిస్థితులున్నాయి. పాతబస్తీలోనే కాదు నగరం నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్, కోఠి, నాంపల్లి, చిక్కడిపల్లి, మెహిదీపట్నం, ఆరాంఘర్, పంజాగుట్ట, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ వంటి పలు ప్రధాన మార్గాల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా స్పందించకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిలో తప్పు చేస్తున్నామనే స్పందనలేకపోవడం, రాజకీయ ప్రయోజనాలతో వారికి మద్దతుగా నేతలు బలప్రదర్శన చేస్తూ అధికారులను అడ్డుకోవడం దురదృష్టకరం. ఇటీవల నగరంలోని ఆరు జోన్లలో అక్రమాలను తొలగిస్తుంటే పాతబస్తీతోపాటు కొన్ని చోట్ల నాయకులు అడ్డుకోవడానికి ప్రయత్నించినా అధికారులు వెనక్కి తగ్గకుండా పని పూర్తిచేయడం అభినందనీయం.

ఎంతోకాలంగా అక్కడ వ్యాపారాలు చేస్తున్నారని, వారందరూ చిరు వ్యాపారులు అంటూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారికి మద్దతుగా నిలిచే వారు వాదిస్తున్నారు. దీర్ఘకాలికంగా వారక్కడ ఆక్రమించి ప్రజలను ఇబ్బందుల పాలుచేస్తున్నారనే ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంటుందనే వాస్తవాన్ని వారు గ్రహించాలి. చిరువ్యాపారుల జీనవోపాధి దెబ్బతినడం బాధాకరమే. ఇలాంటి వారి కోసం అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా ప్రత్యామ్నాయం ఆలోచించి చర్యలు తీసుకోవాలి. మరోవైపు ప్రధాన కూడళ్లలో బడా వ్యాపారస్థులు కూడా తమ దుకాణాలకు ముందున్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి లావాదేవీలు నిర్వహిస్తున్న ప్రదేశాలు నగరంలో కోకొల్లలు. మరికొన్ని చోట్ల పెద్ద వ్యాపారస్థులే వారి మనుషులతో ఫుట్‌పాత్‌లను ఆక్రమింపజేసి వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. వాస్తవాలు ఇలా ఉంటే చిరువ్యాపారులకు అన్యాయం జరుగుతుందంటూ రాజకీయ నేతలు అధికారులపై ఒత్తిడి తేవడం ప్రజలను ఇబ్బందుల పాలుజేయడమే. విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరానికి అనుగుణంగా రహదారులు, ఫుట్‌పాత్ అభివృద్ధి కోసం ఆలస్యంగానైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై కబ్జాల తొలగింపు కార్యక్రమాన్ని ఒక్క రోజుకే పరిమితం చేసి చేతులు దులుపుకోకుండా ఆ అక్రమ కట్టడాలపై పర్యవేక్షణ నిత్యం కొనసాగాలి. తొలగించిన కట్టడాలను పాతబస్తీ వంటి కొన్ని ప్రాంతాల్లో తిరిగి నిర్మిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటిని అరికడితేనే ప్రభుత్వ లక్ష్యం సఫలమవుతుంది. ఎలాంటి ఒత్తిడిలకు లొంగకుండా పాతబస్తీతో సహా నగరంలోని నలుమూలల రహదారులపై అక్రమంగా వెలిసిన కట్టడాలన్నింటినీ తొలగించాలని నగరవాసులు అందరూ కోరుకుంటున్నారు. ఆక్రమణల తొలగింపుతో గ్రేటర్ రహదారులకు మహర్దశ ఏర్పడుతుందని ఆశిస్తున్నారు. ఇలాంటి బహత్కరమైన కార్యక్రమాలను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా కొనసాగిస్తే కబ్జాదారులు మరోసారి అక్రమాలు చేయడానికి సాహసించరు.

# డీలిమిటేషన్ చాలా ప్రమాదకర దిశలో వెళ్తోంది

- మొదటి పేజి తరువాయి

సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు? సీట్లు 50 శాతం పెంచాలని మోదీకి ఏ దేవుడు చెప్పాడు? 50శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం ఏర్పడుతుంది. దక్షిణాదిపై చూపుతున్న వివక్షతో దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా భాజపా వ్యవహరిస్తోంది. మహిళా బిల్లును అడ్డుపెట్టుకొని డీలిమిటేషన్ చేయొద్దు. ప్రస్తుత సీట్ల ప్రకారమే, చట్టాల ప్రకారమే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి. దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి.. పన్నులు కట్టడం, దిల్లీకి వెళ్లి సలాం కొట్టడం అన్నట్లుగా ఉంది. దీనికి మేం వ్యతిరేకం. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ కేపిటల్స్. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ కేపిటల్స్. పొలిటికల్ కేపిటల్స్ ఎప్పుడూ ఫైనాన్షియల్ కేపిటల్స్‌ని తక్కువగా చూస్తాయి. దక్షిణాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతాయి. హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది మా డిమాండ్. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి. కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలి. మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలి. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగింది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

తనపై సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన మంత్రి సీతక్క... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు లీగల్ నోటీసులు పంపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫోన్ల పంపిణీ విషయంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, అవి తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ బాధ్యుడిగా ఈ ప్రచారానికి కేసీఆరే జవాబుదారీ వహించాలని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఫోన్లను పంపిణీ చేసింది. అయితే, ఒక్కో ఫోన్‌ను మార్కెట్ ధర కంటే అధిక మొత్తానికి కొనుగోలు చేసి మంత్రి కమీషన్లు తీసుకున్నారంటూ బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాయి. దీనిపై మంత్రి ఇప్పటికే వివరణ ఇస్తూ.. ఒక్కో ఫోన్‌ను కేవలం రూ. 11,650కే అత్యంత పారదర్శకంగా కొనుగోలు చేశామని వెల్లడించారు. తప్పుడు ప్రచారంతో

ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆమె మండిపడ్డారు. తప్పుడు ఆరోపణలతో కూడిన సోషల్ మీడియా పోస్టులను 48 గంటల్లోగా తొలగించాలని నోటీసుల్లో సీతక్క డిమాండ్ చేశారు. తన ప్రతిష్టకు భంగం కలిగించినందుకు కేసీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని అన్నారు. నిర్ణీత సమయంలో స్పందించకపోతే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

# రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ బలహీనపరుస్తోందని విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను కించపరిచేలా ముఖ్యమంత్రి మాట్లాడటం బాధాకరమని, అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుంచి బహిష్కరించేవారని మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు. గత 50 ఏళ్లలో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన ఆయన, గతంలో పార్లమెంట్‌లో బిల్లు కాపీలు చించివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకోవడంపై నిలదీశారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, ఇది అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ విభజన రాజకీయాలకు నిదర్శనమని, ఇప్పటికైనా రాజ్యాంగ విలువలపై గౌరవంతో మాట్లాడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ఈ ప్రభుత్వం రైతుల కోసమా.. దళారుల కోసమా?
# కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు నిప్పులు

- మొదటి పేజి తరువాయి

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కోటా పూర్తయ్యిందనే సాకుతో కొనుగోళ్లు నిలిపివేయడంపై అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో రైతులు తమ పంటను మద్దతు ధరకు అమ్ముకోలేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీ, కేరళ పర్యటనల్లో బిజీగా ఉంటూ గాలి మోటార్లలో తిరుగుతున్నారని, వారికి నేల మీద ఉన్న రైతుల బాధలు పట్టడం లేదని విమర్శించారు. సదాశివపేట మార్కెట్‌లో ఇప్పటికే కొన్న శనగలను కూడా, బిల్లులు కావడం లేదనే సాకుతో బస్తాలు ఖాళీ చేసి రైతులకు వెనక్కి ఇచ్చేయడం అత్యంత దారుణమని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన 60 వేల క్వింటాళ్ల శనగలను వెంటనే రూ. 5,870 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రతి పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ మాటను 'బోగస్' చేసిందని విమర్శించారు. కనీసం సన్న వడ్లకైనా బోనస్ ఇస్తారో లేదో స్పష్టం చేయాలన్నారు. మొక్కజొన్న, జొన్న, సన్ ఫ్లవర్ కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు పక్క రాష్ట్రాలకు వెళ్లి తక్కువ ధరకే అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కనీసం 24 గంటల ఉచిత విద్యుత్ కూడా ఇవ్వడం లేదని, కేవలం 10 గంటల కరెంటుతో పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. "కరెంటు ఇవ్వరు, రైతుబంధు వేయరు, బోనస్ ఇవ్వరు, పండిన పంటను కొనరు. ఈ ప్రభుత్వం రైతుల కోసమా? లేక కాంట్రాక్టర్లు, దళారుల కోసమా?" అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తక్షణమే ఢిల్లీ పర్యటనలు ఆపి, పంట కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు తదితరులు పాల్గొన్నారు.

# హర్మూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు

- మొదటి పేజి తరువాయి

మహమ్మద్ ఫతాలీ న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత క్లిష్ట సమయంలోనూ సానుకూల సంబంధాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. భారత్‌తో ఉన్న మైత్రి కారణంగా రవాణా ఉచితంగా సాగుతోందని అన్నారు. అమెరికాతో చర్చలు పునఃప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ తమ డిమాండ్లకు అనుకూలంగా స్పందించాలని స్పష్టం చేశారు. మా షరతులను అమెరికా అంగీకరిస్తే, మరో విడత చర్చలు సాధ్యమవుతాయని అన్నారు. ఇటీవల తాత్కాలిక యుద్ధ విరమణ అనంతరం చర్చల సందర్భంగా అమెరికా అంగీకార యోగ్యం కాని డిమాండ్లు తమ ముందు ఉంచిందని పేర్కొన్నారు.

అందుకే చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిందని అన్నారు. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై మహమ్మద్ ఫతాలీ స్పందిస్తూ, ఇరాన్ సామర్థ్యం గురించి వాషింగ్టన్‌కు తెలుసని అన్నారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో, భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

# ఓట్ల తొలగింపుతో ఎన్నికలు ప్రభావమైతే
# తప్ప ఎన్నికను రద్దు చేయలేం

అధిక సంఖ్యలో ఓట్లను తొలగించినా, ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలని తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన 'సర్' ప్రక్రియపై భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటరు జాబితాలో కొనసాగే హక్కు ఓటరుకు ఉంటుందని, ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ప్రక్రియను వక్రీకరించకూడదని పేర్కొంది. అయితే, 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగించారంటూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ పిటిషన్లు ఇప్పటికే అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నాయని గుర్తు చేసింది. సరైన ప్రక్రియ లేకుండా ఎన్నికల సంఘం ఏకపక్షంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తోందని, ఈ తొలగింపులపై దాఖలైన పిటిషన్లను సకాలంలో విచారించడం లేదని పిటిషనర్లు ఆరోపించగా, పిటిషనర్లు ఇప్పటికై ట్రైబ్యునళ్లను ఆశ్రయించారని, కాబట్టి ఈ వాదనల్లో పసలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'సర్' ప్రక్రియపై దాఖలైన పిటిషన్లను విచారించేందుకు కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల

మేరకు 19 ట్రైబ్యునళ్లు ఏర్పడినట్లు ఈసీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారించాల్సిన అప్పీళ్ల సంఖ్య 30 నుంచి 34 లక్షల వరకు ఉంటాయని తెలిపింది. అయితే ఈ అప్పీళ్లను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తారా లేక గడువును పొడిగిస్తూనే ఉంటారా అని పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ దేశంలో

ఓటు రాజ్యాంగపరమైనదే కాకుండా, భావోద్వేగ అంశం కూడా అని పేర్కొంది. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో భాగమని తెలిపింది. ఒక ప్రభుత్వాన్ని ఎంచుకోవడంలో ఇది కీలకమని వ్యాఖ్యానించింది. అలాగే విచారణకు సంబంధించి కాలపరిమితిని నిర్ణయించి ట్రైబ్యునళ్లపై భారం మోపలేమని స్పష్టం చేసింది. అధిక సంఖ్యలో ఓటర్లను తొలగించినా, ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేమని తెలిపింది.

## తెలంగాణలో సమ్మె సైరన్..
# ఏప్రిల్ 22 నుంచి ఆర్టీసీ సమ్మె

- మొదటి పేజి తరువాయి

అనే ధోరణి ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేదే లేదన్నారు. కమిటీ వేశామంటూ కాలయాపన చేయొద్దని..మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలన్నారు జేఏసీ నేతలు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే మేము అడుగుతున్నామని చెప్పారు. కొత్త కోర్కెలేవీ కోరడం లేదని.. ఖాళీగా ఉన్న అన్ని కేటగిరీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను ఇబ్బంది పెట్టే బదిలీలు ఆపి, ఎక్కడి వారిని అక్కడే ఉంచాలన్నారు.

# ఇక సెలవు.. ముగిసిన ఆశా భోస్లే అంత్యక్రియలు

- మొదటి పేజి తరువాయి

రాజకీయ నాయకులు శివాంజీ పార్క్ శ్మశానవాటికకు చేరుకుని ఆశా భోస్లే పార్థివ దేహానికి కడసారి నివాళులు అర్పించారు.

అంతకముందు ఆశా భోస్లే నివాసం నుంచి దాదర్‌లో ఉన్న శివాజీ పార్క్ శ్మశానవాటిక వరకు భారీ జనసందోహం నడుమ ఆమె అంతిమయాత్ర సాగింది. భారత సంగీత శిఖరాన్ని కడసారి చూసేందుకు పలువురు క్రీడా, సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు అంతిమయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముంబై గల్లీలన్ని ఆశాభోస్లే అమరా హే నినాదాలతో మోరుమోగిపోయాయి. ఆశ్రునయనాలతో గాన కోకిలకు అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా, అనారోగ్యంతో భారత సంగీత శిఖరం, లెజెండరీ సింగర్ ఆశా భోస్లే (92) ఏప్రిల్ 12న కన్నుమూసిన విషయం తెలిసిందే. ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో ఆమె తుది శ్వాస విడిచారు. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్?తో ఆమె మరణించినట్లు వైద్యులు వెల్లడించారు.

# ఇటువైపు వస్తే నాశనమే

- మొదటి పేజి తరువాయి

ఇరాన్ నౌకలు వస్తే వాటిని తక్షణమే ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ ఓడరేవులకు వద్దకు నౌకలు రావాలంటే తమ అనుమతి తీసుకోవాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇరాన్ ఓడరేవులకు వచ్చే, పోయే అన్ని సముద్ర మార్గాలను మూసివేస్తూ అమెరికా సైన్యం నిర్దేశించిన గడువు ప్రకారం ఈ దిగ్బంధం ప్రారంభమైంది. "మా దిగ్బంధం సమీపంలోకి ఏ ఒక్క ఇరాన్ నౌక వచ్చినా, దానిని వెంటనే తుడిచిపెట్టేస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు. అయితే, అమెరికా చర్యను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ జలాల్లో నౌకల కదలికలపై ఆంక్షలు విధించడం చట్టవిరుద్ధమని ఇరాన్ సాయుధ దళాలు పేర్కొన్నాయి. మరోవైపు, పాకిస్థాన్‌లో అమెరికాతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తెలిపారు. అమెరికా వైఖరి వల్లే చర్చలు ముందుకు సాగలేదని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌పై బాంబు దాడులు ప్రారంభించింది. మరూబ్ పట్టణంలో జరిగిన దాడుల్లో కనీసం నలుగురు మరణించారు. హెజ్బొల్లాతో ఘర్షణలు కొనసాగుతుండటంతో బింట్ జెబిల్ పట్టణ ప్రవేశ మార్గాలను ఇజ్రాయెల్ సైనికులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ ప్రాంతంలోనూ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

# హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

- మొదటి పేజి తరువాయి

పరిధిలో అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైనట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. నేడు సాయంత్రం 16.01 గంటలకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 4,381 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ వినియోగం నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ, ఇప్పటి వరకు ఇది అత్యధికం. గ్రేటర్ హైదరాబాద్ చరిత్రలో 2026 మార్చి 3వ తేదీన 4,421 మెగావాట్ల విద్యుత్ వినియోగంతో ఇప్పటి వరకు ఆల్ టైమ్ రికార్డుగా ఉంది. రోజురోజుకు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతూ వినియోగదారులకు అవాంతరాలు ఎదురుకాకుండా విద్యుత్ సరఫరా సాగిస్తున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. భవిష్యత్తులో మరింత డిమాండ్ పెరిగినా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

## మంగ్లీ వర్సెస్ అడ్వకేట్ సుబ్బారావు
## పంజాగుట్ట పోలీసుల కీలక వివరణ

- మొదటి పేజి తరువాయి

మీడియాకు పూర్తి వివరాలను వెల్లడించారు. ఈ వివాదం వెనుక ఒక పెద్ద ఫైనాన్స్ స్కామ్ ఉందనే వార్తలపై సీఐ స్పందిస్తూ... ఇప్పటివరకు తమకు ఆ స్కామ్‌కు సంబంధించి ఎలాంటి అధికారిక ఫిర్యాదులు అందలేదని స్పష్టం చేశారు. బాధితులుగా చెప్పుకుంటున్న వారు కూడా ఈ స్టేషన్ పరిధిలోకి రారని తెలిపారు. కొంతమంది బాధితులతో కలిసి సుబ్బారావు స్టేషన్‌కు వచ్చిన సమయంలో, ఆయన మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. తక్షణమే నిర్వహించిన బ్రీత్ అనలైజర్ టెస్టులో 27 ఎంజీ ఆల్కహాల్ శాతం నమోదైనట్లు వెల్లడించారు. టెస్ట్ చేస్తున్న సమయంలో సుబ్బారావు మీడియా సాక్షిగా హంగామా సృష్టించారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించారని పేర్కొన్నారు. ప్రస్తుతానికి రెండు వర్గాల ఫిర్యాదులను నిశితంగా పరిశీలిస్తున్నామని, చట్టప్రకారం నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగిస్తామని పంజాగుట్ట సీఐ తెలిపారు.

# ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య అవగాహనే




- భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదన్న రాంచందర్ రావు
- ఖానాపూర్‌లో కాంగ్రెస్ అధికార బలం పనిచేయలేదని ఎద్దేవా
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోందని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో పొత్తుల అంశంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కీలక ప్రకటన చేశారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించిన నేపథ్యంలో నిర్మల్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని, ఒంటరిగానే పోరాడుతుందని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య కుదిరిన అవగాహన మాత్రమేనని, పార్టీ పరంగా ఎలాంటి అధికారిక పొత్తు లేదని ఆయన వివరణ ఇచ్చారు.అధికార కాంగ్రెస్ పార్టీ పోలీసు బలంతో, గుండాయిజంతో భయభ్రాంతులకు

-5లో

పెన్ పవర్
తెలంగాణ రౌండప్


# రూ.100 కోట్లు విలువైన..! ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు..!



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు..

## బౌరంపేటలో ఈ భూకబ్జా బట్టబయలు..! ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..!

- సర్వే నెం.166/9 పేరుతో సర్వే నెం.166/1 ప్రభుత్వ భూమిలో పాగా ఆరోపణలు..!
- దుండిగల్ గండిమైసమ్మ మండలం బౌరంపేట్‌లో వెలుగు చూసిన కబ్జా..!
- సంబంధం లేని భూమికి కలెక్టర్ ప్రొసీడింగ్..! ఏ ప్రాతిపదికన ఇచ్చారని ప్రశ్నలు..?
- సర్వే నెం.166/1లో 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలకు డిమాండ్..!
- తప్పుడు ప్రొసీడింగ్స్‌తో ప్రభుత్వ భూమి సక్రమం చేసుకునే యత్నంపై ఆరోపణలు..
- అసైన్డ్ ల్యాండ్స్ చట్టం ఉల్లంఘించిన ఉత్తర్వులపై విచారణకు డిమాండ్.
- కబ్జాను తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న ఫిర్యాదు దారులు..
- స్పందించకపోతే ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరిక..



కత్వ చెరువు అంచున సర్వే నెం.166/1 ప్రభుత్వ భూమి..

-4లో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బౌరంపేట గ్రామంలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి అన్న ఆరోపణలు, చర్చనీయాంశంగా మారాయి.. దాదాపు రూ.100 కోట్ల విలువైన సర్వే నెం.166/1 భూమిని, తప్పుడు ఉత్తర్వుల ఆధారంగా సక్రమం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని, జిల్లా ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.. చట్టాలను పక్కన పెట్టి సర్వేలు నిర్వహించడం..! అసైన్డ్ భూముల బదిలీల్లో నిబంధనలు ఉల్లంఘించడం..!చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో భూమిలో మట్టినింపి చదును చేయడం వంటి అంశాలు ఈ వ్యవహారాన్ని మరింత వివాదాస్పదంగా మార్చాయని విమర్శలు వినిపిస్తున్నాయి.. వెంటనే ఆక్రమణలు తొలగించి, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారులు డిమాండ్ చేశారు.. లేకపోతే ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఆందోళనకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 13:

# రాజకీయం చేయకండి: రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి విజ్ఞప్తి



- డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోదని హామీ
- తాము కూడా దక్షిణాది రాష్ట్రంలోనే ఉన్నామన్న కిషన్ రెడ్డి
- ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వబోమని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో స్పందించారు. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయవద్దని ఆయన కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని కోరారు. డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోదని హామీ ఇచ్చారు. మేం కూడా దక్షిణాది రాష్ట్రంలోనే ఉన్నామని వ్యాఖ్యానించారు. ఇక్కడి రాష్ట్రాలకు తాము ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరుగుతుందని కిషన్ రెడ్డి అన్నారు. ఈ ప్రక్రియకు రెండేళ్ల సమయం పడుతుందని తెలిపారు. కాబట్టి ఈ ప్రక్రియను ఎవరు కూడా రాజకీయం చేయవద్దని కోరారు.

-5లో



# తండ్రికి ఘన నివాళులు...

## మంత్రి శ్రీధర్ బాబు భావోద్వేగ ట్వీట్

- తండ్రి, మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు నివాళి
- సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ సందేశం పోస్ట్ చేసిన శ్రీధర్ బాబు
- ఆఖరి శ్వాస వరకు మంథని ప్రజల కోసమే పనిచేస్తానని ప్రతిజ్ఞ
- 1999లో ఇదే రోజున నక్సలైట్ల చేతిలో శ్రీపాదరావు హత్యకు గురైన వైనం

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తన తండ్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దివంగత డి. శ్రీపాదరావు వర్ధంతి (ఏప్రిల్ 13) సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఫొటోలను పంచుకుని, తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి నేర్పిన విలువలనే మార్గదర్శకాలుగా ప్రజాసేవలో ముందుకు సాగుతానని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తన సందేశాన్ని పంచుకున్నారు. "నాన్నా... మీరు నేర్పిన సంస్కారం, అందించిన విలువలు, చూపిన బాట... ప్రజా సేవలో నన్ను నిత్యం ముందుకు నడిపించే వెలుగు దివ్వెలు. మీ అడుగుజాడలే నా ధైర్యం.. మీ ఆశీస్సులే నా బలం. మీ వారసత్వాన్ని గుండెల్లో మోస్తూ... మీ ఆశయాలే మార్గదర్శకంగా... మీ బిడ్డగా నా ఆఖరి శ్వాస వరకు 'మంథని' ప్రజల కోసమే పని చేస్తా. మీ స్ఫూర్తితో మొదలైన నా ఈ సేవా యజ్ఞం ఆగదు.. ప్రజల పట్ల నాకున్న ఈ సంకల్పం సడలదు. మీ అడుగుజాడల్లో నా ఈ ప్రయాణం నిరంతరం

-5లో

# కేటీఆర్ పాదయాత్రను స్వాగతిస్తాం.. వచ్చే ఎన్నికల్లో మాకు పోటీయే లేదు

- ప్రజాస్వామ్యంలో ఎవరైనా పాదయాత్రలు చేపట్టవచ్చన్న మహేశ్ గౌడ్
- బీఆర్ఎస్ పేరు మార్చినా కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరని వ్యాఖ్య
- ప్రభుత్వం ప్రతి నెల రూ. 7 వేల కోట్ల అప్పులు చెల్లిస్తోందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టబోయే పాదయాత్రను తాము స్వాగతిస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పాదయాత్రలు చేపట్టవచ్చని చెప్పారు. రాజకీయాల్లో ప్రతి కార్యక్రమానికి తమ మద్దతు ఉంటుందని, అయితే ప్రజల మద్దతు మాత్రం కాంగ్రెస్‌కే ఉందని ధీమా వ్యక్తం చేశారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సరైన పోటీదారులే లేరని, బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని ఆయన జోస్యం చెప్పారు.బీఆర్ఎస్ పేరు మార్చినా లేదా బీజేపీతో కలిసి పోటీ చేసినా కాంగ్రెస్ జైత్రయాత్రను అడ్డుకోలేరని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని, ముఖ్యంగా సింగరేణిలో జరిగిన అక్రమ ఒప్పందాలు, అవినీతిని కార్మికులు ఎన్నటికీ మర్చిపోరని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో పునరుజ్జీవం పొందే శక్తి లేదని ఆయన ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కవితకు ఫండింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని చెబుతూ, ప్రతిపక్షాల ఆరోపణలను కొట్టిపారేశారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పందిస్తూ, ప్రతి నెలా ప్రభుత్వం సుమారు రూ. 7 వేల కోట్ల అప్పులను చెల్లిస్తోందని మహేశ్ గౌడ్ వెల్లడించారు.


-5లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రూ.100 కోట్లు విలువైన..!
# ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు..!

## బౌరంపేటలో ఈ భూకబ్జా బట్టబయలు..! ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..!

- సర్వే నెం.166/9 పేరుతో సర్వే నెం.166/1 ప్రభుత్వ భూమిలో పాగా ఆరోపణలు..!
- దుండిగల్ గండిమైసమ్మ మండలం బౌరంపేట్‌లో వెలుగు చూసిన కబ్జా..!
- సంబంధం లేని భూమికి కలెక్టర్ ప్రొసీడింగ్..! ఏ ప్రాతిపదికన ఇచ్చారని ప్రశ్నలు..?
- సర్వే నెం.166/1లో 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలకు డిమాండ్..!
- తప్పుడు ప్రొసీడింగ్స్‌తో ప్రభుత్వ భూమి సక్రమం చేసుకునే యత్నంపై ఆరోపణలు..
- అసైన్డ్ ల్యాండ్స్ చట్టం ఉల్లంఘించిన ఉత్తర్వులపై విచారణకు డిమాండ్.
- కబ్జాను తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న ఫిర్యాదు దారులు..
- స్పందించకపోతే ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరిక..




మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు..

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బౌరంపేట గ్రామంలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి అన్న ఆరోపణలు, చర్చనీయాంశంగా మారాయి.. దాదాపు రూ.100 కోట్ల విలువైన సర్వే నెం.166/1 భూమిని, తప్పుడు ఉత్తర్వుల ఆధారంగా సక్రమం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని, జిల్లా ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.. చట్టాలను పక్కన పెట్టి సర్వేలు నిర్వహించడం..! అసైన్డ్ భూముల బదిలీల్లో నిబంధనలు ఉల్లంఘించడం..!చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో భూమిలో మట్టినింపి చదును చేయడం వంటి అంశాలు ఈ వ్యవహారాన్ని మరింత వివాదాస్పదంగా మార్చాయని విమర్శలు వినిపిస్తున్నాయి.. వెంటనే ఆక్రమణలు తొలగించి, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారులు డిమాండ్ చేశారు.. లేకపోతే ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఆందోళనకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 13:**

ఐదెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చెరనుంచి విముక్తి కల్పించి, స్వాధీనం చేసుకోవాలని ఆకుల సతీష్ టీమ్ డిమాండ్ చేశారు.. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.. గండిమైసమ్మ దుండిగల్ మండల పరిధిలోని బౌరంపేట్ సర్వే నెం. 166/9 చూపిస్తూ, దాదాపు 100 కోట్ల విలువైన సర్వే నెంబర్ 166/1 ప్రభుత్వ భూమిని రెండేళ్ళ క్రితమే ఆక్రమించు కున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.. తప్పుడు ఉత్తర్వులతో దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని,ఆరోపిస్తూ అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు అందజేశారు.. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో, ఆకుల సతీష్ మాట్లాడుతూ..! ప్రస్తుత కలెక్టర్ ప్రొసీడింగ్ నెంబర్: A1/899/2024, తేదీ 17-01-2026 జారీ చేశారని ఫిర్యాదు దారులు అభ్యంతరం వ్యక్తం చేశారు.. ఎక్స్ సర్వీస్ మెన్ నరసింహారావు భూమిని రత్న ప్రియకు, విక్రయించగా..! ఆమె నుంచి జీవన్‌రెడ్డి కొనుగోలు చేసిన ఈ పట్టాకు ప్రభుత్వ భూమి లేకపోవడంతో..! సర్వే నెంబర్ 166/9 కు బదులు.. సర్వే నెంబర్ 166/1 విలువైన ప్రభుత్వ భూమి, ఔటర్ రింగ్ రోడ్డు ఆనుకొని, కత్వ చెరువు బఫర్ జోన్‌లోనూ కొంత భూమి ఆక్రమించుకుని సక్రమం చేసుకోవడానికి జారీ చేసిన ఉత్తర్వులు చట్టబద్ధంగా విరుద్ధమని ఫిర్యాదు దారులు ఆరోపిస్తున్నారు..

హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న ఈ ప్రభుత్వ భూమి, సుమారు రూ.100 కోట్లకు పైనే ఉంటుందని అన్నారు.. ఎక్స్ సర్వీస్ మెన్ పట్టా పేరిట, విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు, కలెక్టర్ తప్పుడు ప్రొసీడింగ్‌ను రద్దు చేయాలని ఫిర్యాదు దారుల డిమాండ్.. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.. చట్టవిరుద్ధమైన భూ ఉపవిభజనలను రద్దు చేయాలని,అసైన్డ్ భూముల అక్రమ బదిలీలను రద్దు చేసి ప్రభుత్వ స్వాధీనం చేసుకోవడం, ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించాలని కోరారు.



కలెక్టరేట్ ఆవరణలో ఆకుల సతీష్ టీమ్ ప్రెస్‌మీట్..

## చట్టాలు ఉల్లంఘించి..! నిబంధనలు అతిక్రమించి..!

**మాజీ సైనికులకు కేటాయించిన సంబంధిత చట్టాల ప్రకారం, నోటీసులు ఇవ్వకుండా, సర్వే నిర్వహించడం, తెలంగాణ సర్వే అండ్ బౌండరీస్ చట్టం, 1923 నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని సతీష్ పేర్కొన్నాడు.. అదేవిధంగా, సర్వే నెం. 166/9లో 4.38 ఎకరాల భూమిని, అసలైన ఎక్స్-సర్వీస్ మెన్‌కు భూమిని గతంలోనే కేటాయించారని సతీష్ ప్రకటనలో తెలిపారు.. ఓవైపు ఎక్స్ సర్వీస్ మెన్ నరసింహారావు పట్టాకు, అదనంగా భూమి లేనప్పటికీ..! మరోవైపు ప్రభుత్వం నుండి ఎలాంటి 'ఎన్‌వోసి' కూడా లేకుండానే..! ముగ్గురి పేరుమీదకు ఎక్స్ సర్వీస్ మెన్ పట్టాను క్రయవిక్రయాలు జరపడం చట్టవిరుద్ధమని తెలిపారు.. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ లాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) చట్టం, 1977 ప్రకారం చెల్లవని తక్షణమే 'ఎక్స్ సర్వీస్ మెన్' పట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు..**

## ప్రొసీడింగ్ జారీకి.. క్యాబినెట్ ఆమోదం తప్పనిసరి: సతీష్..!

బౌరంపేట్ నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్ళే దారిలో కత్వ చెరువును ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 166/1లో దాదాపు 100 కోట్ల విలువైన ఈ ప్రభుత్వ భూమిని 2024లోనే కబ్జా చేసుకొని..! అదే భూమిని ఇప్పుడు, 166/9/2 గ, సక్రమం చేసుకోవడానికి కలెక్టర్‌తో ఉత్తర్వులు ఇప్పించుకోవడం చట్టం విరుద్ధమని ఆరోపిస్తున్నారు.. సంబంధిత కబ్జా స్థలానికి వేసిన ఫెన్సింగ్‌ను, వెంటనే తొలగించి, ఈ భూమిని ప్రభుత్వం తిరిగి స్వాధీన పరుచుకోవాలని డిమాండ్ చేశారు.. ఎక్స్ సర్వీస్ మెన్‌కి భూమి కేటాయించడానికి ప్రామాణికమైన, G.O.Ms. No.307 రెవెన్యూ (అసైన్‌మెంట్) శాఖ, తేదీ 06-06-2013 , సెక్షన్ 8 ప్రకారం ప్రభుత్వ భూముల కేటాయింపు రాష్ట్ర ప్రభుత్వం (క్యాబినెట్ ఆమోదం) పరిధిలోనే ఉంటుందని, జిల్లా స్థాయి అధికారులకు స్వతంత్ర అధికారం లేదని ఫిర్యాదులో ప్రస్తావించారు..


పెన్ పవర్
సర్వే నెంబర్ ఓచోట... స్వాధీనం మరోచోట


సర్వే నెంబర్ ఓచోట.. స్వాధీనం మరోచోట..

కత్వ చెరువు అంచున
సర్వే నెం.166/1
ప్రభుత్వ భూమి..





# సీతక్క నూ మాజీ ఎమ్మెల్యే గండ్ర మండిపాటు

**వరంగల్: పెన్ పవర్:** అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లలో అవినీతి జరిగిందని సోషల్ మీడియా మరియు ప్రతిపక్షంగా అడిగితే "చెప్పులు తెగుతాయి" వంటి వ్యాఖ్యలు చేయడం ఇదేం సాంప్రదాయమని మంత్రి సీతక్క వ్యాఖ్యలపైమాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. మంత్రి సీతక్క బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి డిమాండ్ చేసారు. రాజకీయాల్లో ఆరోపణలు వస్తేవాటిని ఆధారాలతో సహా నిరూపించాలి గానీ. "చెప్పు తెగుతుంది" వంటి పరుష వ్యాఖ్యలు చేయడం తగదు. తమపై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ.. వాటికి ఎప్పుడూ సముచితంగా సమాధానం
ఇచ్చామే తప్ప ఈ విధంగా దూషణలకు దిగలేదు. అధికారంలో ఉండి కేవలం ఆరోపణలు చేయడం సరైంది కాదు.
భూపాలపల్లి గడ్డమీద నేటి ముఖ్యమంత్రి, అప్పట్లో టిపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, నాపై 1400 ఎకరాల భూమి కబ్జా చేశాడని ఆరోపణలు చేశారు.. రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ ఆరోపణలునిరూపించలేకపోయారు .. ఇప్పటికే నేను దానిపై కోర్టులో పరువు నష్టం కేసులు, క్రిమినల్ కేసులు దాఖలు చేశాను. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు.., కానీ ప్రభుత్వం నుంచిఇలాంటి భాషలో స్పందించడం అనుచితమని అన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

### తండ్రికి ఘన నివాళులు...
## మంత్రి శ్రీధర్ బాబు భావోద్వేగ ట్వీట్

-3 పేజి తరువాయి

కొనసాగుతూనే ఉంటుంది" అని పేర్కొన్నారు.కాగా, శ్రీపాదరావు 1999 ఏప్రిల్ 13న కరీంనగర్ జిల్లాలో నక్సలైట్ల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. ఆయన మరణానంతరం శ్రీధర్ బాబు రాజకీయాల్లోకి ప్రవేశించి, మంథని నియోజకవర్గం నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## కేటీఆర్ పాదయాత్రను స్వాగతిస్తాం.. వచ్చే ఎన్నికల్లో మాకు పోటీయే లేదు

-3 పేజి తరువాయి

ఈ క్రమంలో కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజా సంక్షేమ పథకాలను ఆపకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. అప్పుల భారం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు.

## రాజకీయం చేయకండి: రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి విజ్ఞప్తి

-3 పేజి తరువాయి

దక్షిణాది నుంచి ప్రస్తుతం కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రమంత్రులు అయ్యారని, డీలిమిటేషన్ జరిగితే చప్రాసీ పదవి కూడా రాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని, ఈ వ్యాఖ్యలపై మీరేం సమాధానం చెబుతారని కిషన్ రెడ్డిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు.దానికి కిషన్ రెడ్డి స్పందిస్తూ, రేవంత్ రెడ్డి వారానికి ఒకసారి ఢిల్లీకి వెళు తున్నారని, ఎందుకు అలా వెళుతున్నారో ఆయన సమాధానం చెప్పాలని నిలదీశారు. కానీ కాంగ్రెస్ పార్టీలో ఏ పదవి కావాలన్నా ఆయన ఢిల్లీకి డబ్బులు మోసుకెళుతున్నారని ఆరోపించారు. కానీ బీజేపీలో అలా ఉండదని అన్నారు. అందుకే ఆయన చప్రాసీ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.

## ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య అవగాహనే

-3 పేజి తరువాయి

గురిచేసినప్పటికీ, ప్రజలు బీజేపీకే పట్టం కట్టారని ఆయన కొనియాడారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ అధికార బలం పనిచేయలేదని ఎద్దేవా చేశారు. తలసరి ఆదాయం ప్రాతిపదికన అసెంబ్లీ సీట్లు పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఈ ప్రతిపాదన పేదలను, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయడమేనని విమర్శించారు.50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళల హక్కులను పట్టించుకోలేదని మండిపడ్డారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా బీజేపీ అడుగులు వేస్తోందని, వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోందని, రానున్న రోజుల్లో సొంత బలంతోనే అధికారం చేపడతామని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశ రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం లభిస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మొలంగూర్ లో రోడ్డు భద్రతా అవగాహన, ఉచిత కంటి పరీక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా, మానకొండూర్ మండలంలోని మొలంగూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఖఊఅ) వద్ద ఏప్రిల్ 15, 2026, సోమవారం నాడు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సిపి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఆటో మరియు లారీ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, యూనిఫామ్ మరియు హెల్మెట్ పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టబడతాయి. ఈ కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జరుగుతుంది.

## బూరుగుపల్లిలో విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:** : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో ఆదివారం, కళ్ళల బండ నుండి బోయినిపల్లి మామిండ్ల బస్టాండ్ వరకు రహదారి పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల లైన్ కు విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా సహకరించిన గ్రామ వాస్తవ్యులు కొలుపుల రాజు ఏడిఈ కి, పాలమర్తి వేణుగోపాలచారి కి సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్, ఉపసర్పంచ్ కల్లేపల్లి చంద్రయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు అంజయ్య, సత్తయ్య, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలుపుల ప్రవీణ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత, ప్రతి ఒక్కరి బాధ్యత






**ఖమ్మం, రూరల్ పెన్ పవర్, ఏప్రిల్ 13:** ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నియమాలను పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో ఉంటాయని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.రోడ్డు ప్రమాదాల కారణంగా జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యానికి చేరాలనే ఉద్దేశంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజలను సమాయత్వం చేసేందుకు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ విభాగాలు చెందిన అధికారులు ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఖమ్మం రూరల్ మండలం, వరంగల్ క్రాస్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్, సీటుబెల్ట్ వాడకంలో అలసత్వం వంటి కారణాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అవగాహన అత్యంత అవసరమని భావించి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలుసుకుని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేసే వారితో పాటు వెనుక కూర్చునే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీట్ బెల్టులు ధరించాలన్నారు. - ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయడం నిబంధన విరుద్ధమని, ఓవర్‌టేక్ కేవలం కుడి వైపు నుండి మాత్రమే చేయాలన్నారు. భారీ వాహనాలు, నెమ్మదిగా వెళ్లే వాహనాలు ఎడమ వైపున, మిగిలినవి కుడి వైపున నడపాలన్నారు. ప్రధాన రహదారులపై పార్కింగ్ చేయరాదన్నారు. పార్కింగ్ లైట్లు లేకుండా పార్కింగ్ చేయరాదన్నారు. వాహనాలపై రేడియస్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలని, అప్రమత్తంగా, సురక్షితంగా ఉండటం చాల కీలకమని పేర్కొన్నారు. సురక్షితంగా రోడ్డు దాటడం కోసం పాఠశాలలు, పార్కుల దగ్గర రోడ్లపై "నెమ్మదిగా నడపండి" అనే సైన్ బోర్డులను గమనించాలని సూచించారు.కార్యక్రమంలో రూరల్ ఇన్స్పెక్టర్ రాజు, విద్యుత్ శాఖ (ఏఈ) కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తెలంగాణ

**హైదరాబాద్, ఏప్రిల్ 13 , పెన్ పవర్:**
తెలంగాణ ప్రభుత్వం మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను ప్రారంభించింది. గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక ఎస్ఐసీయూ, కౌన్సెలింగ్‌కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ౹౼ూచీదీ అందించే అత్యాధునిక కిట్ల ద్వారా 12 రకాల డ్రగ్స్‌ను నిమిషాల్లోనే గుర్తిస్తున్నారు. బాధితులకు 6 వారాల పాటు పునరావాసం కల్పిస్తూ..చట్టపరమైన నిబంధనల ప్రకారం చికిత్స అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.ఇప్పటికే నార్కోటిక్ విభాగంతో పాటు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి మత్తుపై ఉత్తుపాదం మోపుతోంది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్విహిస్తూ.. గంజాయి, కొకైన్ ఇతర డ్రగ్స్ ముఠాలను కట్టడి చేస్తున్నారు.ఇటీవల కాలంలో చాలా చోట్ల దాడులు నిర్వహించి పలువుర్ని అరెస్టు చేశారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం ఒక సామాజిక విపత్తుగా మారుతున్న తరుణంలో.. తెలంగాణ ప్రభుత్వం సంచలననిర్ణయం తీసుకుంది. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు.. అన్ని జిల్లాల్లోనూ ఏకకాలంలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు.తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఈ కేంద్రాల్లో మల్టీ-డ్రగ్ టెస్ట్ కిట్‌లనుసరఫరా చేశారు. ఈ కిట్ల ద్వారా గంజాయి, ఓపియాయిడ్స్, కొకైన్, యాంఫెటమైన్స్ వంటి దాదాపు 12 రకాల మాదకద్రవ్యాలను మూత్ర పరీక్ష ద్వారా కేవలం నిమిషాల్లోనే గుర్తించవచ్చు. గాంధీ ఆసుపత్రిసైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ కె. అనుపమ తెలిపిన వివరాల ప్రకారం.. కిట్‌లో ఎరుపు గీత కనిపించకపోతే సదరు వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారిస్తారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక పరీక్షలు మాత్రమే.అవసరమైతే మరిన్ని లోతైన క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తారు. గత రెండు రోజుల్లో 90 మందికి పరీక్షలు చేయగా.. సుమారు 40 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.తీవ్రమైన వ్యసనానికిగురైన వారు లేదా మత్తు పదార్థాలు అందక శారీరకంగా ఇబ్బంది పడే వారి కోసం సబ్‌స్టెన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఐసీయూ తరహాలోనే పనిచేస్తుంది. డ్రగ్స్ మానేయడం వల్లవచ్చే ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితుల్లో రోగులను ఇక్కడ చేర్చుకుని నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. పోలీసులు తీసుకొచ్చే నిందితుల విషయంలో ప్రభుత్వం పక్కాగా నిబంధనలుఅమలు చేస్తోంది. నిందితులను పరీక్షల కోసం ఫారమ్ ౼ూతో తీసుకొస్తారు. ఫలితాలను ఫారమ్ దీలో నమోదు చేస్తారు. నిందితుడు చికిత్సకు అంగీకరిస్తే ఫారమ్ జ ద్వారా అడ్మిషన్ ప్రక్రియచేపడతారు.చికిత్స తర్వాత రోగులను డ్రగ్ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్స్‌కు పంపిస్తారు. ఇక్కడ ఆరు వారాల పాటు నిపుణుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్, ఫ్యామిలీ థెరపీ, నార్కోటిక్స్ అనానిమస్ వంటి గ్రూప్‌సెషన్లు నిర్వహిస్తారు. వ్యసనం అనేది ఒక వ్యాధి అని దానిని చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది యువత తిరిగి సాధారణజీవితం గడిపే అవకాశం కలుగుతుందని అంటున్నారు.

# ఎల్పీజీ కష్టాలకు చెక్...

**హైదరాబాద్, ఏప్రిల్ 13, పెన్ పవర్:**
పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఎల్పీజీ సరఫరాలో తలెత్తే ఇబ్బందులను అధిగమించడానికి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పైపుల ద్వారా సహజ వాయువు పంపిణీని ప్రభుత్వం వేగవంతం చేసింది.
గోదావరి బేసిన్ నుంచి పూడూరు ప్లాంట్ ద్వారా గ్యాస్‌ను తీసుకుని ఇళ్లకు సరఫరా చేసేందుకు భాగ్యనగర్, మెగాసిటీ గ్యాస్ ఏజెన్సీలు సిద్ధమవుతున్నాయి. పైప్‌లైన్ల నిర్మాణానికి 24 గంటల్లోనే వాట్సప్
ద్వారా అనుమతులు ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ప్రస్తుతం గ్యాస్ కొరత ఏర్పడింది. బుక్ చేసిన నెల రోజులకు కూడా సిలిండర్‌దొరకని పరిస్థితి. గ్యాస్ కోసం ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. మారుతున్న అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ఇంధన భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుతం ఎల్పీజీసరఫరాకు ఆటంకాలు కలగకుండా ఉండేందుకు.. పైపుల ద్వారా సహజ వాయువును నేరుగా ఇళ్లకు సరఫరా చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ శివారుజిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్‌లో ఈ ప్రాజెక్టును వేగవంతం చేస్తోంది.ఈ భారీ ప్రాజెక్టుకు మూలం గోదావరి బేసిన్. కాకినాడ నుంచి ముంబై మీదుగా అహ్మదాబాద్ వరకు సాగే ప్రధాన గ్యాస్ పైప్‌లైన్ మేడ్చల్
జిల్లా పూడూరు గ్రామం మీదుగా వెళ్తోంది. ఇక్కడ ఉన్న ఎల్పీజీ నిల్వ ప్లాంట్ ద్వారా గ్యాస్‌ను సేకరించి అక్కడి నుంచి భాగ్యనగర్ గ్యాస్ ఏజెన్సీ లిమిటెడ్, మెగాసిటీ గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు పంపిణీ చేయనున్నాయి. దీనివల్ల సిలిండర్ల బుకింగ్, డెలివరీ కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ప్రాజెక్టు వేగంగా పూర్తి కావడానికి రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, మనుచౌదరిలు

ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. పైప్‌లైన్ల నిర్మాణానికి రోడ్లు తవ్వాల్సి ఉంటుంది. దీని కోసం దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే అనుమతులు ఇచ్చేలా ప్రత్యేక కమిటీని నియమించారు.అనుమతుల
ప్రక్రియను సులభతరం చేస్తూ ఒక ప్రత్యేక వాట్సప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఏజెన్సీలు తమ దరఖాస్తులను ఇందులోనే పంపవచ్చు. మొదటి విడతలో భాగంగా సైబరాబాద్, మల్కాజిగిరి
కార్పొరేషన్లతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని తొమ్మిది మున్సిపాలిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పీఎన్‌జీ వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా.. సురక్షితంగా నిరంతరాయంగా అందుబాటులో ఉంటుంది.గృహ వినియోగదారులతో పాటు అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, రెస్టారెంట్లకు కూడా ఈ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ పైప్‌లైన్ నెట్‌వర్క్ పూర్తయితే.. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఇంధన వినియోగం సరికొత్త పుంతలు తొక్కనుంది.

# నేడు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి

## సమానత్వం నుంచి జాతీయ సమగ్రత వరకు మార్గదర్శి అంబేద్కర్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ చరిత్రలో సమాజాన్ని లోతుగా ప్రభావితం చేసిన మహనీయుల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్థానం అత్యంత విశిష్టమైనది.ఆయన కేవలం రాజ్యాంగ రూపకర్త మాత్రమే కాదు, సామాజిక న్యాయం, సమానత్వం, స్వాభిమానం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత దార్శనికుడు. అంబేద్కర్ జీవితం అనేది ఒక సాధారణ వ్యక్తి అసాధారణ స్థాయికి ఎలా ఎదగగలడో చూపించిన గొప్ప ఉదాహరణ. చిన్ననాటి నుంచే వివక్షను ఎదుర్కొన్న ఆయన, ఆ అనుభవాలను తన బలహీనతగా కాకుండా, సమాజాన్ని మార్చే శక్తిగా మలిచారు. విద్యనే ఆయుధంగా ఎంచుకుని ప్రపంచ స్థాయి విద్యను సాధించడం ద్వారా, జ్ఞానం ద్వారా సమాజాన్ని మార్పు చేయవచ్చని ఆయన నిరూపించారు. అంబేద్కర్ భావజాలంలో సమానత్వం ఒక మూల సూత్రం. ఆయన అభిప్రాయం ప్రకారం, సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి వ్యక్తికి సమాన అవకాశాలు ఉండాలి. కులం, మతం, భాష వంటి భేదాలు మనుషుల మధ్య గోడలు కట్టకూడదు. ఈ దృక్పథం కేవలం ఒక వర్గానికి మాత్రమే కాదు, మొత్తం భారత సమాజానికి వర్తిస్తుంది. భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ గారి పాత్ర అపూర్వమైనది. ప్రతి పౌరుడికి హక్కులు, స్వేచ్ఛలు, రక్షణ కల్పించేలా రూపొందించిన రాజ్యాంగం భారత ప్రజాస్వామ్యానికి పునాది అయింది. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించే విధానాలు ఆయన దూరదృష్టిని ప్రతిబింబిస్తాయి. అంబేద్కర్ ఆలోచనలు కేవలం హక్కుల గురించి మాత్రమే కాదు, బాధ్యతల గురించి ఉన్నాయి. సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించి, చైతన్యంతో ముందుకు రావాలి. ఇదే నిజమైన ప్రజాస్వామ్యం అని ఆయన నమ్మకం. విద్యార్థి సమాజం మార్పుకు కీలక శక్తి. ఈ దిశగా



పనిచేస్తున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అంబేద్కర్ ఆశయాలను యువతలో విస్తరించేందుకు కృషి చేస్తోంది. విద్యతో వ్యక్తి నిర్మాణం, వ్యక్తి నిర్మాణం ద్వారా సమాజ నిర్మాణం అనే సూత్రం అంబేద్కర్ భావజాలానికి దగ్గరగా ఉంటుంది. జాతీయత భావంతో సమాజ సమస్యలను చూడడం, పరిష్కరించడం ఏబీవీపీ లక్ష్యం. అంబేద్కర్‌ను ఒక వర్గానికి పరిమితం చేయడం ఆయన ఆశయాలను చిన్నబుచ్చడమే అవుతుంది. ఆయన లక్ష్యం సమాజాన్ని విభజించడం కాదు, సమగ్రతతో ముందుకు తీసుకెళ్లడం. అందుకే ఆయన ఆలోచనలు ప్రతి భారతీయుడికి వర్తిస్తాయి.ప్రస్తుత కాలంలో కూడా అంబేద్కర్ భావజాలం అత్యంత ప్రాసంగికం. ఇంకా సమాజంలో అసమానతలు, వివక్షలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అంబేద్కర్ చూపిన మార్గం మనకు దిశానిర్దేశం చేస్తుంది. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే ఆయన సూత్రాలు సమాజ అభివృద్ధికి కీలకం. అంబేద్కర్ మహిళల హక్కుల పరిరక్షణలో కూడా కీలక పాత్ర పోషించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ గౌరవం, అవకాశాలు కల్పించాలనే ఆయన దృక్పథం సమగ్ర సమాజ నిర్మాణానికి అవసరం.ఇది కేవలం ఒక చరిత్ర కాదు,ఒక మార్గదర్శకం. అంబేద్కర్ చూపిన మార్గాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది. ఆయన ఆశయాలను కేవలం పుస్తకాలలోనే కాకుండా, మన జీవితాల్లో అమలు చేయడం అత్యవసరం.అంబేద్కర్ ఒక వ్యక్తి కాదు --- ఒక భావజాలం. ఒక ఉద్యమం, సమాజాన్ని కలిపే ఒక శక్తి, దేశాన్ని బలపరిచే మహోన్నత శక్తి. ఆయన చూపిన మార్గంలో నడిస్తేనే నిజమైన సమాన సమాజం నిర్మించగలం.చివరగా ప్రతి యువకుడు తనలో అంబేద్కర్ ఆలోచనలను జాగృతం చేసుకోవాలి. సమాజానికి బాధ్యతగా నిలబడాలి. అదే ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవం. అందుకే మనం గర్వంగా చెప్పాలి అంబేద్కర్ కొందరివాడు కాదు... ఆయన నిజంగా అందరి వాడు

**సదా భారతమాత సేవలో..**

**ఆక్కారి మహేష్**

**ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి**

# బాధ్యతగా డ్రైవ్ చేస్తేనే బతుకు సురక్షితం





**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 13:** ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని ఎస్సై సాయికుమార్ అన్నారు. గార్ల మండల కేంద్రంలోని స్థానిక మేజర్ గ్రామపంచాయతీ ఆవరణంలో సర్పంచ్ బానోత్ పార్వతి నాయక్ అధ్యక్షతన సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించి హెల్మెట్ లేని రోడ్డు ప్రమాదాలు మైనర్ డ్రైవింగ్ డ్రంకన్ డ్రైవ్ వంటి వాటిపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో పోలీస్ శాఖ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలు నివారించడం సాధ్యమవుతుందన్నారు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, రక్షణాత్మక డ్రైవింగ్ పాటించాలని తెలిపారు. ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయడం ప్రమాదకరమని, అతివేగం ప్రాణాంతకమని హెచ్చరించారు. మైనర్ల డ్రైవింగ్ నిషేధమని, మద్యం సేవించి వాహనం నడపడం చట్టవిరుద్ధమన్నారుమొబైల్ ఫోన్లను రక్షించేందుకు పౌచ్ లు, స్క్రీన్ గార్డులు ఉపయోగిస్తున్నప్పటికీ, తమ ప్రాణ రక్షణకు అవసరమైన హెల్మెట్, సీట్ బెల్ట్ లను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు. అందరూ ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటిస్తూ, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎండి జరినా బేగం పంచాయతీ కార్యదర్శి బుర్ర రమేష్ వార్డు మెంబర్లు అంగన్వాడీ టీచర్లు ఆశా కార్యకర్తలు పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం





**ఖమ్మం, రూరల్ పెన్ పవర్, ఏప్రిల్ 13:** ఖమ్మం జిల్లా గుర్రాలపాడు గ్రామం ఏడవ డివిజన్ లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ప్రజల నుంచి విశేష స్పందనను పొందింది. గ్రానైట్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ శ్రీ రాయల నాగేశ్వరరావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వైద్య సేవలు అధిక ఖర్చుతో కూడుకున్నవిగా మారాయని, పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్న గ్రానైట్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ కు అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో హైదరాబాద్ యశోద వైద్య బృందం ఖమ్మంలోని ప్రముఖ నేత్ర వైద్యులు వాసన్ ఐ కేర్ సాయికేర్ డెంటల్ కు చెందిన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో మొత్తం 500 మంది పాల్గొని వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడవ డివిజన్ కౌన్సిలర్ బుర్ర మహేష్ గోపాల్ రావు పరమేశ్వర్ రెడ్డి అదాలత్ నరేంద్ర వెంపటి వెంకటేశ్వర్లు వెంపటి ఉపేందర్ నునావత్ కిషన్ జానీ పాషా ఆకుల సైదులు నజీర్ పాషా కాత్రం గిరి గోవింద భద్రం మూర్తి నరసింహారావు అంజి దుర్గారావు రఘు వీరబాబు తదితరులు పాల్గొన్నారు

## దండి రంగారావుకు ఘన సన్మానం



**ఖమ్మం,రూరల్ పెన్ పవర్, ఏప్రిల్ 13:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28వ డివిజన్ కౌన్సిలర్ దండి రంగారావుని ఖమ్మం జిల్లా జేసీబీ ఓనర్స్ మరియు ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఘనంగా ఆయన నివాసం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా పూల మాలలు వేసి శాలువతో సత్కరించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అసోసియేషన్ కు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జేసీబీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంపటి స్వామి, జిల్లా మరియు వరంగల్ క్రాస్ రోడ్ సమితి సభ్యులు పుణ్యకోటి, వెంపటి వెంకటేశ్వర్లు, ధనియాల సుధాకర్, వెంపటి పృథ్వి, కత్తి రాము, శ్రీశైలం బీరయ్య సుమన్, జేసీబీ ఆపరేటర్ సభ్యులు మహేందర్, సాయి, వినయ్, సంపత్, మహేష్, వెంకటేష్, నాగరాజు, మున్సిపాలిటీ సిపిఐ నాయకులు వెంపటి సురేందర్, వెన్నం భాస్కర్, వెంపటి శీను, వెంపటి రాము, వెంపటి వీరయ్య, మిరియాల నరుణ్ తేజ్, బుద్ధి రాధాకృష్ణ, బూరెల రాము, చింతల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## సమ సమాజ స్థాపనే అంబేద్కర్ లక్ష్యం




**గార్ల పెన్ పవర్ ఏప్రిల్ 13:** అసమానతలు లేని సమాజం కోసం అంబేద్కర్ నిరంతరం కృషి చేశారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజు అన్నారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం ముందస్తుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అంబా వాడ గ్రామంలో 1891 ఏప్రిల్ 14న సక్వాల్ భీమా భాయ్ రాంజీ మాలోజి ఆదర్శ దంపతులకు జన్మించారని అతడు పుట్టుకతోనే అనేక అవమానాలు ఎదుర్కొని ప్రపంచ మేధావిగా పేరు పొందాడన్నారు ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగమైన భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిశ నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని ఆయన సేవలను కొనియాడారు. రాజ్యాంగాన్ని గౌరవించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.ఈకార్యక్రమంలో అధ్యాపకులు టి నాగూర్ డాక్టర్ ఎం రామ్మోహన్ రావు పున్నం చందర్ రాజేష్ వీరన్న డాక్టర్ జి సుందరయ్య మేఘన అనూష లావణ్య అధ్యాపకేతర సిబ్బంది పద్మ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

## గార్ల ను నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలి'



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 13:** మండల కేంద్రమైన గార్ల పట్టణాన్ని ప్రత్యేక నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్ లాల్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో గార్లను తిరిగి ఇల్లందు నియోజకవర్గంలో విలీనం చేసే అవకాశాలపై వస్తున్న వార్తలు మండల ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఇల్లందు నియోజకవర్గం ఏర్పడిన నాటినుండి కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా గార్ల మండలం నిలిచిందని 2014 నుండి కాంగ్రెస్ పార్టీ మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యే గెలుపులో గార్ల మండలం కీలక పాత్ర పోషించిందన్నారు 2023 నవంబర్ ఎన్నికల్లో పోలైన 24 వేల ఓట్లలో కాంగ్రెస్ పార్టీకి గార్ల మండలంలో 16 వేల పైచిలుకు ఓట్లు పోలయ్యాయి కాంగ్రెస్ పార్టీకి 67% ఓట్లు వేసిన గార్ల మండలం అభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందని మండల ప్రజలు కేవలం ఓట్లు వేసే యంత్రాలు లాగే మిగిలిపోయారన్నారు గార్ల మండలం విస్తీర్ణం జనాభా పరంగా 75 వేల జనాభా 40 వేల ఓటర్లు 20 గ్రామపంచాయతీలు 85 గ్రామాలు ఉన్నాయని గార్ల మండలం నియోజకవర్గంగా మారితే భవిష్యత్తులో అభివృద్ధి కేంద్రంగా మారే అవకాశం ఉందని తెలిపారు ఇల్లందు నియోజకవర్గ కేంద్రం మండల ప్రజలకు దూరం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గార్ల కామేపల్లి బయ్యారం గంగారం నాలుగు మండలాలను కలుపుతూ నియోజకవర్గంగా గార్లను ప్రకటించాలని దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



**ఖమ్మం, రూరల్ పెన్ పవర్, ఏప్రిల్ 13:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28 29 30 వార్డులకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన 79,500 విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ చెక్కులు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సిఫారసు ద్వారా లభించాయి. చెక్కులు అందుకున్న వారిలో గోలి ఇంద్ర 18,500, గోలి హర్షిని రూ. 17,000, మామిడి అంజయ్య రూ. 25,000, పానమాకుల ఎలిశయమ్మ రూ. 19,000, ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు 28 డివిజన్ కౌన్సిలర్ దండి రంగారావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, వెన్నం భాస్కర్, సిపిఐ మండల నాయకులు, 29, డివిజన్ సిపిఐ కార్యదర్శి వెంపటి రాము, 28డివిజన్ సిపిఐ కార్యదర్శి లాగిశెట్టి రమేష్, సిపిఐ మున్సిపాలిటీ నాయకులు యోబు కుమార్,బుర్లె రాము,బుద్ధి రాధా కృష్ణ, రమేష్, ఆనంద్, మరియు యువజన సంఘ నాయకులు, మిరియాల నరుణ్ తేజ్, చింతల ఉదయ్, కొక్కు రితిక్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా పెరిగిన మిర్చి ధరలు

**వైరా, ఏప్రిల్ 13(పెన్ పవర్:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మిర్చి, పత్తి ధరలు గణనీయంగా పెరిగాయి. క్వింటా ఏసీ మిర్చి రూ. 21,825, నాన్ ఏసీ మిర్చి రూ. 21,000, పత్తి రూ. 8,200 పలికింది. గత శుక్రవారంతో పోలిస్తే ఏసీ మిర్చి ధర రూ. 1425, నాన్ ఏసీ మిర్చి ధర రూ. 900, పత్తి రూ. 100 పెరిగినట్లు మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యాపారస్తులు తెలిపారు. రైతులు నిబంధనలు పాటించాలని సూచించారు.

## పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

**పాలేరు, ఏప్రిల్ 13పెన్ పవర్,:** అనారోగ్యం, అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందిన అడపా నరసింహారావు (38) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దమ్మపేటలో చోటుచేసుకుంది. సొంత భూమితో పాటు కౌలుకు తీసుకున్న భూమిలో వ్యవసాయం చేస్తున్న నరసింహారావుకు పంటల్లో సరైన దిగుబడి రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. పాంక్రియాటైటిస్ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఈ దారుణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికిషోర్ తెలిపారు.

## అసమాన ప్రతిభాశాలి రాహుల్ సాంకృత్యాయన్

**హైదరాబాద్ పెన్ పవర్:** రాహుల్ సాంకృత్యాయన్ (1893 ఏప్రిల్ 9 ? 1963 ఏప్రిల్ 14) అసమాన ప్రతిభాశాలి, ఆయన మేధస్సును కొలవడానికి ఏ కొలబద్ద సరి పోదంటే అతిశయోక్తి కాదేమో. కాలాలకు అతీతంగా యావత్ ప్రపంచ చరిత్రలోనే స్వయం కృషితో మహా పండితుడైన వ్యక్తి మరొకరు లేరని మేధావులు భావించడాన్ని బట్టి ఆయన ప్రతిభ తేట తెల్లం అవుతున్నది. ముప్పైకి పైగా భాషలు, వాటి యాసలు నేర్చుకుని అధికారికంగా చదువుకోక పోయినా విశ్వ విద్యాలయాల్లో బోధించే స్థాయికి ఎదగడాన్ని బట్టి ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది.రాహుల్ సాంకృత్యాయన్ నిరంతర లోక సంచారిగా పేరొంది, 45 సంవత్సరాల పాటు యాత్రలలోనే గడిపారు. లోతైన తాత్త్విక చింతన కలిగిన సాంకృత్యాయన్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి బౌద్ధ భిక్షువుగా మారి అనంతరం మార్క్సిస్ట్ సోషలిస్టుగా పరివర్తన చెందారు. సాంకృత్యాయన్ భారత జాతీయోద్యమంలో కూడా కృషి చేశారు. జాతీయోద్యమానికి అనుకూలంగా, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు, ప్రసంగాలు చేసినందుకు 3సంవత్సరాల కారాగార శిక్షను అనుభవించారు. 1940వ దశకం ప్రారంభంలో ఆయన పూర్తిగా భౌతికవాద భావాలను స్వీకరించి, కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యునిగా చేరి, జీవితాంతం కమ్యూనిస్ట్‌గా ఉన్నారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా ఆయన అనేక రైతు పోరాటాలకు నాయకత్వం వహించారు. పురాతన బౌద్ధ గ్రంథాలను వెలికితీసి, వాటిని అనువాదం చేసి, ప్రపంచానికి తెలియపరచటంలో రాహుల్ అపారమైన కృషిని బౌద్ధులు ఎంతో విలువైనదిగా గుర్తించారు. యునై టెడ్ ప్రావిన్సెస్ (యూపీ) రాష్ట్రంలోని అజామ్‌గఢ్ జిల్లాలో 1893 ఏప్రిల్ 9లో సనాతన ధర్మాన్ని పాటించే బ్రాహ్మణ కుటుంబంలో కేదార్‌నాథ్ పాండే జన్మించారు. బౌద్ధాన్ని స్వీకరించాక, తన పేరును రాహుల్ సాంకృత్యాయన్‌గా మార్చు కున్నారు. ప్రాథమిక విద్య ఉర్దూ మాధ్యమంలో చదివారు. తొమ్మిదేళ్లప్పుడే ప్రపంచం ఏమిటో చూడాలని ఇంట్లోంచి పారిపోయాడు సాంకృత్యాయన్. 8వ తరగతి తోనే అతని చదువు ఆగిపోయింది. కాశీ విద్యాపీఠ్‌లో సంస్కృతం నేర్చుకున్నాడు. ఆర్యసమాజంలో చేరి హిందూమత వ్యాప్తికి కొన్నాళ్లు కృషి చేశాడు. ఆయన నిత్యసంచారిగా వేలాది కిలోమీటర్లు కాలినడకన చుట్టివచ్చారు. మూడు బౌద్ధ వేదాలనూ జీర్ణించుకుని త్రిపిటకాచార్య అయ్యారు. టిబెట్, శ్రీలంక, ఇరాన్, చైనా, అప్పటి సోవియట్ రష్యా... ఎక్కడ తిరిగితే అక్కడి భాష నేర్చుకున్నారు. అరబిక్, భోజ్‌పురి, ఫ్రెంచ్, హిందీ, కన్నడం, మైథిలి, నేపాలీ, పాళీ, పర్షియన్, రష్యన్, రాజస్థానీ, సింహళీస్, తమిళం, ఉర్దూ లాంటి భాషలు అవలీలగా ఆయన నేర్చుకుని పట్టు సాధించారు. పదమూడో శతాబ్దంలో నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలను భక్తియార్ ఖిల్జీ ధ్వంసం చేసినప్పుడు బౌద్ధ భిక్షువులు పవిత్రమైన గ్రంథాలతో పారి పోయారనీ, ఆ విలువైన సంస్కృత పుస్తకాల్ని టిబెట్‌లోని ఆరామాల్లో భద్రపరిచి వుంచారనీ ప్రచారంలో ఉంది. అయితే, ఆరు వందల ఏళ్లుగా వాటిల్లో ఏముందో చూసినవారు లేరు. సాంకృత్యాయన్ వాటికోసం అన్వేషిస్తూ, దారి కూడా సరిగాలేని కొండల్లో నడుస్తూ, కాశ్మీర్, లడఖ్, కార్గిల్ మీదుగా టిబెట్ వెళ్లారు. అక్కడ పుస్తకాలైతే లభించాయిగానీ అవి సంస్కృతంలో లేవు. అన్నీ భోటి భాషలో ఉన్నాయి. రాహుల్ కంచర గాడిదల మీద వాటిని తరలించు కొచ్చారు. ఆ గ్రంథాలన్నీ పాట్నా మ్యూజియంలో ఉన్నాయిప్పుడు. మరో మూడుసార్లు టిబెట్ వెళ్లి, టిబెటన్ నేర్చుకుని, దాని వ్యాకరణ పుస్తకాలు రాశారు. టిబెటన్–హిందీ నిఘంటువు కూర్చారు. నాటి సోవియట్ యూనియన్‌లోని అనేక రిపబ్లిక్కులలో ఆయన విస్తృతంగా పర్యటించి, సంస్కృతం, పాళీ భాషలో లిఖించబడిన అనేక శాసనాలను, రాతి ఫలకాలనూ కనుగొన్నారు. భారతదేశంలోనూ, నేపాల్, హిమాలయ సానువులలోనూ, టిబెట్ లోనే కాకుండా ఆయన మంగోలియా, ఆఫ్ఘనిస్తాన్ ఆదిగా అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. తన యాత్రలో భాగంగా అరుదైన "కాన్జూర్, టాన్జూర్, గ్రంథాలను కొన్నాడు 130 వర్ణ చిత్రాలు 1600 కు పైగా వ్రాత ప్రతులు సేకరించారు. యాత్రికుడు యువాన్ త్స్యాంగ్ తర్వాత ఇంత భారీగా సేకరించిన వారెవరు లేరని చరిత్ర కారుల అంచనా. 70 సంవత్సరాల వయస్సులో మరణించే సమయానికి, ఆయన దాదాపు 140 పుస్తకాలు రాశారు. జీవితంలో మొత్తం జ్ఞాపకశక్తిని కోల్పోయారు. వందలాది పుస్తకాలు కూడా కంఠోపాఠంగా కలిగిన మహా జ్ఞాని, విజ్ఞాన ఖని చివరి రోజుల్లో తన పేరేమిటో తనే చెప్పుకోలేని మతిమరుపు లోకి జారి పోయారు.1963 ఏప్రిల్ 14లో శ్రీలంకలో ఆచార్యుడుగా పనిచేస్తూ, ఆయన అంతిమ శ్వాస విడిచారు. ఆయన స్మృతి చిహ్నం డార్జిలింగ్ నగరంలో బౌద్ధమత పద్ధతిలో నిర్మించబడింది.

1958లో సాహిత్య అకాడమీ పురస్కారం, 1963లో పద్మభూషణ్ బిరుదులు ఆయనకు లభించాయి.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఎమ్మెల్యేకు వినతి

**బోథ్, ఏప్రిల్ 13 పెన్ పవర్:** బోథ్ మండలంలోని మర్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మర్లపల్లి సర్పంచ్ శీలాబాయి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ వినతికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించారు. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా ఈ చర్యలు తీసుకోబడతాయని భావిస్తున్నారు.

### స్నేహితులతో మద్యం గొడవ: యువకుడి ఆత్మహత్య

**ఆదిలాబాద్, ఏప్రిల్ 13 పెన్ పవర్:** నిర్మల్ జిల్లాలోని మమాడ మండలం తాంద్ర గ్రామానికి చెందిన షేక్ జుబేర్ (22) అనే యువకుడు స్నేహితులతో మద్యం విషయంలో జరిగిన గొడవతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం జరిగిన ఈ సంఘటనలో, బీర్ల విషయంలో జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీయడంతో జుబేర్‌ను అతని స్నేహితులు పోశెట్టి, రాజులు కొట్టారు. మరుసటి రోజు జరిగిన పంచాయతీలో హెచ్చరించినా మనసులో బాధతో జుబేర్ పురుగుల మందు తాగాడు. నిర్మల్ ఆసుపత్రిలో పరిస్థితి విషమించడంతో అదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ గా మౌనిక మహేందర్ బాధ్యతలు స్వీకరణ

**ఖానాపూర్, ఏప్రిల్ 13( పెన్ పవర్:** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన అంకం మౌనిక మహేందర్ పదవీ బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచంద్రరావు రాకను పురస్కరించుకుని, జన్నారం మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు అధ్యక్షతన జన్నారం నుంచి భారీ సంఖ్యలో బిజెపి నాయకులు వాహనాలతో ఖానాపూర్ కు ర్యాలీగా బయలుదేరారు. నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ పిలుపు మేరకు కొమరం భీమ్ చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే బైక్ ర్యాలీలో పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

### గుడిహత్నూర్: వాహనం బోల్తా.. ఒకరి మృతి

**ముథోల్, ఏప్రిల్ 13 పెన్ పవర్:** గుడిహత్నూర్ మండలం సీతాగొంది సమీపంలో జాతీయ రహదారిపై రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తాంసి మండలంకు చెందినవారు బోథన్ నుండి తిరిగి వస్తుండగా, సీతాగొంది వద్ద ఆటోను తప్పించే ప్రయత్నంలో తుఫాన్ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో హేమలత అనే మహిళ మృతి చెందగా, మరికొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

## రేపాకలో గ్రామసభ నిర్వహణ

**కరీంనగర్, ఏప్రిల్ 13 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం రేపాకలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ప్రజాపాలన?ప్రగతిప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించనున్నరు. అరైవ్‌అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాలపై సర్పంచ్ కాతమల్లేశం ఆధ్వర్యంలో అధికారులు, నాఎ లక్పతి, ఉఖ కార్యదర్శి ప్రవీణ్, ప్రజలు, పాలకవర్గం సమీక్షించి, దిశానిర్దేశం చేశారు.

### మాదాపూర్ లో వీధి కుక్కల స్వైరవిహారం

**హుజూరాబాద్, ఏప్రిల్ 13 పెన్ పవర్:** మాదాపూర్ గ్రామంలో వీధి కుక్కల స్వైరవిహారంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆదివారం, బుచ్చిరెడ్డికి చెందిన సుమారు రూ.60 వేల విలువైన పాడి ఆవుపై వీధి కుక్కలు గుంపులుగా దాడి చేసి చంపేశాయి. సమీపంలో కోళ్ల వ్యర్థాలు పడేయడం వల్ల కుక్కలు గుంపులుగా చేరుతున్నాయని, దీంతో అవి పాకల్లోని పశువులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ కుక్కల బెడద నుండి తమకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సీ. సీ కెమెరాలను పరిశీలించిన రూరల్ ఎస్ఐ



**మునుగోడు, ఏప్రిల్ 13 పెన్ పవర్:** కోదాడ మండలం దోరకుంటలో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను కోదాడ రూరల్ ఎస్.ఐ గోపాల్ రెడ్డి పరిశీలించారు. సూర్యాపేట ఎస్పీ నరసింహ సహకారంతో, దోరకుంట సర్పంచ్ పాలకి సురేష్ గ్రామ ప్రజల సహాయంతో ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. త్వరలో మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి కోదాడ, హుజూర్నగర్ పరిధిలోని సీసీ కెమెరాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలకి సురేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు పత్తిపాక వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ వనపర్తి పిచ్చయ్య, కోటేశ్వరరావు, పత్తిపాక రమేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అంబేద్కర్ జీవితంలో ముఖ్య ఘట్టాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రాజ్యాంగ నిర్మాత, విద్యాధికుడు, తత్వవేత్త, సంపాదకుడు, విప్లవకారుడు, దార్శనికుడు, చరిత్రకారుడు, ప్రాసంగికుడు, రచయిత, దళిత జన బాంధవుడు, అర్థ శాస్త్రజ్ఞుడు, స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ అమాత్యులు, న్యాయవాది, బౌద్ధ ధర్మ పునరుద్ధారకుడు, భారతరత్న డాక్టర్ భీమ్‌రావురాంజీ అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి. 1891 ఏప్రిల్ 14న నాటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరం ఐన మహోమ్ ఊరిలో రాంజీ మలోజి సాక్పాల్, భీమాబాయి దంపతులకు 14వ, చివరి సంతానంగా జన్మించిన భీమ్ రావు, క్రమశిక్షణతో పెరిగి ప్రతిదినం రామాయణ, భారత, తుకారాం, మోరోపంత్ ల గీతాలు గానం చేసేవారు. ఆధునిక మహారాష్ట్రలో రత్నగిరి జిల్లాలో అంబావడే పట్టణంలో ఆయన కుటుంబం జీవించినందున, మరాఠీ నేపథ్యాన్ని కలిగి ఉన్నారు. వారి కుటుంబం శాకాహారం తీసుకునేది. మొహర్లు అస్పృశ్యులుగా, పరిగణింపబడిన కాలంలో, బాల్యం నుండి అంటరాని తనాన్ని ఎదుర్కొని, ఎన్నో అవమానాలకు గురైనారు. 1996లో ప్రాథమిక విద్య, ఏలిఫిస్టన్ హైస్కూల్‌లో 1907లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేశారు. 1908లో 16వ ఏటనే రమా బాయ్ తో వివాహం జరిగింది. బరోడా మహారాజు షాయాజీ గాయేక్వాడ్‌ద్వారా 25 రూపాయల విద్యార్థి వేతనంతో 1912లో ఏలిఫిస్టన్ కళాశాలలో బిఏ ఉత్తీర్ణులు అయినారు. 1913లో రాజుగారి ఆర్థిక సాయంతో కొలంబియా యూనివర్సిటీలో చేరారు. 1915 – 16 లో ఎం.ఏ,పీహెచ్‌డీ సాధించారు. 17 లో తిరిగి వచ్చి మహారాజు మిలిటరీ కార్యదర్శిగా పనిచేశారు. కొల్హాపూర్ మహా రాజు సాహు మహారాజ్ సహాయంతో, "మూక్ నాయక్" పక్ష పత్రికకు సంపాదకత్వం వహించారు. సాహూ మహారాజ్ సాయంతో 1920లో విదేశీ చదువులకు పయనమయ్యారు. 22 లో బారిస్టర్ ఎట్‌లాకు ఆహ్వానం అందింది. 27మార్చి 20న మహద్ చెరువు నీరు స్వీకరించి పోరాటం జరిపారు. 27లో 'బహిష్కృత భారతి' మరాఠీ పక్ష పత్రిక ప్రారంభించారు. 27 డిసెంబర్ 25న "మనుస్మృతి"ని దహనం చేశారు. 1930లో నాగపూర్ ప్రసిద్ధ ఉపన్యాసం గావించారు. 30 నవంబర్ 12న మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. 2వ సమావేశంలో దళితులకు ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపు విషయంలో మహాత్మా గాంధీతో తీవ్రంగా విభేదించారు. 32 లో రాంసే మెక్‌డొనాల్డ్" కమ్యునల్ అవార్డు' ప్రకటన ద్వారా ప్రత్యేక నియోకవర్గాల ప్రతిపాదన జరిగింది. పూనా ఒప్పందం ద్వారా కమ్యునల్ అవార్డు కన్నా ఎక్కువ స్థానాలు వుమ్మడి నియోజక వర్గాలలో ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. 35 మార్చి 24న రమాబాయ్ మరణించింది. 36లో " కుల నిర్మూలన" గ్రంథాన్ని రచించారు. 42 జూలై 18న షెడ్యూలు కులాల ఫెడరేషన్ ను స్థాపించారు. 42 నుండి 46 వరకు వైస్రాయి క్యాబినెట్ లో "కార్మిక మంత్రి"గా పని చేశారు. 47 ఆగస్టు 3న "న్యాయశాఖ మంత్రి"గా బాధ్యతలు స్వీకరించారు. ఆగస్టు 19న "రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్" గా నియమితులైనారు. 48 ఏప్రిల్ 15న తమ 55వ ఏట బ్రాహ్మణ కుటుంబానికి చెందిన శారదా కబీర్ ను ద్వితీయ వివాహ మాడారు. 50 నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదం పొందింది. 51 లో న్యాయ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. 52 లో ముంబాయి శాసన సభ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 56 అక్టోబర్ 14న నాగపూర్ లో "బౌద్ధ మతం" స్వీకరించారు. డిసెంబర్ 6న ఢిల్లీలో పరమ పదించారు. అంబేద్కర్ మరాఠీ, హిందీ, ఇంగ్లీష్, గుజరాతీ, పాళీ, సంస్కృతం, బెంగాలీ, పర్షియన్, ఫ్రెంచ్, జర్మన్ తదితర భాషలలో ప్రావీణ్యత సాధించడమే కాక పాళీ – ఇంగ్లీష్ నిఘంటువు కూడా రాశారు. ఆయనను ఒక వ్యక్తిగా కాక, శక్తిగా, మహోద్యమంగా, విద్యావేత్తగా, సాంఘిక సంస్కర్తగా, స్వతంత్ర ప్రతిభకు చిరునామాగా, సాహిత్య వ్యాప్తికి నిరంతర కృషి సల్పి, మానవత్వాన్ని, సకల జనసంక్షేమాన్ని కోరిన భారత రత్నంగా, ప్రతి భారతీయుడు పూర్తిగా స్ఫూర్తిని తీసుకోవాల్సి ఉంది.

## తెలంగాణకు గర్వకారణం అంబేడ్కర్ విగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:** గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహం ఆవిష్కరణ జరిగి మూడేళ్లు గడిచాయి. భారాస వ్యవస్థాపక అధినేత, గత ప్రభుత్వాధినేత కేసీఆర్ చేతులమీదుగా అంబేద్కర్ జన్మదినమైన ఏప్రిల్ 14న 2023న విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ విగ్రహం భారత దేశంలోనే అత్యున్నత అంబేద్కర్ విగ్రహం కావడం తెలంగాణకే గర్వకారణం. దేశ చరిత్రను ఆవిష్కరించిన మహాపురుషుల్లో డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ పేరు శాశ్వతంగా మెరిసి పోతుంది. ఆయన దళితులకు, సామాజికంగా బలహీన వర్గాలకు ప్రతినిధిగా కాకుండా, భారత దేశానికి రాజ్యాంగాన్ని అందించిన గొప్ప పురుషుడిగా, చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. అటువంటి మహానేతకు అర్థమైన స్థాయిలో నివాళి అర్పిస్తూ తెలంగాణ రాష్ట్రం నిర్మించిన 125 అడుగుల విగ్రహం దేశానికే కాదు, ప్రపంచానికే గొప్ప సందేశాన్ని అందించింది. భారత రాజ్యాంగ నిర్మాత, విద్యాధికుడు, తత్వవేత్త, సంపాదకుడు, విప్లవకారుడు, దార్శనికుడు, చరిత్రకారుడు, ప్రాసంగికుడు, రచయిత, దళిత జన బాంధవుడు, అర్థ శాస్త్రజ్ఞుడు, స్వతంత్ర భారత తొలి న్యాయ శాఖ అమాత్యులు, న్యాయవాది, బౌద్ధ ధర్మ పునరుద్ధారకుడు, భారతరత్న డాక్టర్ భీమ్ రావు రాంజీ అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్ లోని హుస్సేన్ సాగర్ తీరంలో ఎన్టీఆర్ గార్డెన్ కు ఆనుకుని ఉన్న స్థలంలో ఏర్పాటు చేశారు. దేశంలో ఇప్పటి వరకు ఉన్న అంబేద్కర్ విగ్రహాల్లో ఇదే ఎత్తైనది. పార్లమెంటు ఆకారంలో 50 అడుగుల పీఠాన్ని నిర్మించి, దాని పైన అంబేద్కర్ లోహ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 11.80 ఎకరాల స్థలాన్ని దీనికోసం కేటాయించారు. 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం 2016 ఏప్రిల్ 14న శంకుస్థాపన గావించారు. పద్మభూషణ్ రామ్ వంజి సుతార్ విగ్రహ రూప శిల్పిగా, దేశం లోనే అతి ఎత్తైన అంబేద్కర్ విగ్రహం 2 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేశారు. విగ్రహ నిర్మాణం వెనుక ఉన్న శిల్పకళ, సాంకేతిక నైపుణ్యం ఎంతగానో ప్రశంసనీయం.బేస్‌మెంట్ ఎత్తు 50 అడుగులు, వెడల్పు 45.5 అడుగులు, వినియోగించిన స్టీల్ 791 టన్నులు, ఇత్తడి 96 మెట్రిక్ టన్నులు, మొత్తం వ్యయం రూ.146 కోట్లతో 425మంది శ్రామికులు పని చేశారు. 36 ఎకరాల్లో అంబేద్కర్ స్మృతి వనంలో రాక్ గార్డెన్, ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, మెయిన్ ఎంట్రెన్స్, వాటర్ ఫౌంటేన్, సాండ్ స్టోన్ వర్క్, జిఆర్‌సి, గ్రానైట్ ఫ్లోరింగ్, లిఫ్ట్ ఏర్పాటు చేశారు. సందర్శకులకు అంబేద్కర్ జీవిత తత్వాన్ని, విలువలను మరింత సజీవంగా అనుభవించేందుకు అవకాశం కల్పిస్తాయి. నాడు ఏప్రిల్ 14నాటి విగ్రహా విష్కరణ కార్యక్రమం కోసం రూ. 10 కోట్లను నాటి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్, నాటి బీఆర్ఎస్ ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు అయినారు. అంబేద్కర్ విగ్రహం కేవలం ఒక శిల్పం కాదు ఇది భారత సమాజంలో సమానత్వం, న్యాయం, స్వాతంత్ర్య భావాల్ని ప్రతిబింబించే ఒక భావోద్వేగ నిర్మాణం. అంబేద్కర్ గారి తత్వచింతన, రాజ్యాంగ రచన, దళిత సంక్షేమానికి ఆయన చేసిన పోరాటాలన్నింటినీ ఈ విగ్రహం సజీవంగా గుర్తు చేస్తుంది. ఇది భారత ప్రజాస్వామ్యానికి, హక్కుల సాధనకు నిలిచిన ఒక స్ఫూర్తిదాయక చిహ్నం. తెలంగాణ రాష్ట్ర గత ప్రభుత్వం నిర్మించిన అంబేద్కర్ విగ్రహం కేవలం నిర్మాణంలోనే కాదు, ఆలోచనల్లోనూ, తత్వంలోనూ గొప్పది. ఇది తరతరాలకు స్ఫూర్తిగా నిలిచి, దేశవ్యాప్తంగా అంబేద్కర్ సందేశాన్ని విస్తరించేదిగా నిలవనుంది. ఇది తెలుగువాళ్ళకే కాదు, భారతదేశానికే గర్వకారణం.

## అగ్నిప్రమాదాలు- అప్రమత్తత అత్యవసరం

**హైదరాబాద్ పెన్ పవర్:** అగ్ని వలన జరిగే ప్రమాదాలను అగ్ని ప్రమాదాలు అంటారు. ఇవి వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ మూడవ వారంలో వారం రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆస్పత్రులు, కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతారు. ఆర్టీసీ బస్టాండ్లు, పెట్రోల్ బంకులు, మార్టు, అపార్ట్మెంట్లు, పాఠశాలలు, ఫ్యాక్టరీల, గ్యాస్ సరఫరా కేంద్రాల వద్ద డెమో నిర్వహిస్తారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారు. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు... ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలు అందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతి క్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించ గలిగితే, ఎక్కువ నష్టం కలుగకుండా నివారించ వచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియచేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి. విద్యుదాఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాలవుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయి. ఎండా కాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా పెద్దపెద్ద అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్ట వచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు, అయోమయానికి గురికాకుండ ఉండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు. ఆసుపత్రులు, హోటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ, ముందు భాగంలో గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. అధిక నీటి సామర్థ్యం గల ట్యాంకులను అమర్చుకోవాలి. నీళ్ళు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలకు ఒకే స్టెయిర్ కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించటానికి మరో స్టెయిర్‌కేస్ సమకూర్చు కోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసు కోవాలి. స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయో గించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం , వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయ బడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది.

ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి.అగ్ని ప్రమాదం సంభించినపుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారిని పిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించాలి. అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారు పడక, జాగ్రత్తగా వ్యవహరించాలి.దుస్తులకు నిప్పంటుకున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పు కోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి.

# 800 నిబంధనలు ఇక 100 లోపే - సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, పరిశ్రమల ఏర్పాటులో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు సిద్ధమైంది. బ్రిటీష్ కాలం నాటి కాలం చెల్లిన చట్టాలను రద్దు చేస్తామని, అవసరమైతే దీని కోసం ప్రత్యేక ఆర్డినెన్స్‌లు కూడా తీసుకువస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర బృందంతో సీఎం సమావేశమై, డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



**800 నిబంధనలకు కత్తెర**

పరిశ్రమల ఏర్పాటులో జాప్యాన్ని తగ్గించేందుకు ప్రస్తుతం ఉన్న నిబంధనలను భారీగా తగ్గించాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 800కు పైగా నిబంధనలను వంద లోపుకు తీసుకురావాలని, అలాగే అనుమతుల సంఖ్యను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అధికారులు అనవసరంగా తిప్పకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారాలకు లైఫ్ టైం లైసెన్సింగ్ ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీ పడకుండానే, వ్యాపారులకు సానుకూల వాతావరణం కల్పించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**మే 31 నాటికి ఫేజ్-2 పూర్తి**

రాష్ట్రంలో డి-రెగ్యులేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని ఈ సమీక్షలో వెల్లడైంది. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో భాగంగా ఇప్పటికే 7 శాఖల్లో 23 ప్రాధాన్య అంశాలను పూర్తి చేయగా, ఫేజ్-2లో మరో 28 అంశాలను నిర్దేశించుకున్నారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రక్రియ పూర్తయితే పరిశ్రమల ఏర్పాటుకు పట్టే సమయం కనీసం 40 శాతం వరకు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. అలాగే అనుమతులకు సంబంధించిన మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేసి పారదర్శకతను పెంచాలని సీఎం ఆదేశించారు.

**ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అనుమతులు**

పరిశ్రమల కోసం ప్రస్తుతం ఉన్న 82 రకాల అనుమతులను దశలవారీగా 57కు తగ్గించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఒకే శాఖలో ఉన్న వివిధ రకాల పర్మిషన్లను విలీనం చేయడం ద్వారా ఫైళ్ల కదలికను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి ప్రక్రియలను మరింత సులభతరం చేయాలన్నారు. భూ వినియోగానికి సంబంధించిన క్లిష్టతను తగ్గించేందుకు ఇప్పటికే నాలా చట్టాన్ని రద్దు చేశామని, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అన్ని రకాల అనుమతులు లభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అఫిడవిట్ ఆధారంగా వ్యాపారాలకు పచ్చజెండా**

ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగంలో పెట్టుబడిదారులను ప్రోత్సహించేందుకు అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించే వినూత్న విధానాన్ని అమలు చేయాలని సీఎం నిర్ణయించారు. దీనివల్ల అనుమతుల కోసం వేచి చూడకుండా వెంటనే పనులు మొదలుపెట్టే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు. నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర అవసరాలకు తగ్గట్టుగా సరళమైన ఫైర్ సేఫ్టీ నిబంధనలను తీసుకురావాలని, విద్యుత్ కనెక్షన్లు కూడా త్వరితగతిన అందేలా చూడాలని ఆదేశించారు. మీ సేవా, సింగిల్ డెస్క్ పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ వంటి డిజిటల్ వ్యవస్థల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సేవలను మరింత చేరువ చేయాలని వివరించారు.

**కేంద్రం కంటే ఏపీ ముందడుగు**

ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న సంస్కరణలను కేంద్ర బృందం ప్రత్యేకంగా అభినందించింది. డి-రెగ్యులేషన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాల కంటే ఏపీ ప్రభుత్వం మెరుగ్గా పనిచేస్తోందని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ కొనియాడారు. జూన్ నెల నుండి ప్రారంభమయ్యే ఫేజ్-3లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (¬×) టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్ వంటి అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నామని, రాబోయే రోజుల్లో టెక్నాలజీ ద్వారా మరింత వేగంగా పాలన అందిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మార్పు కోరుతున్న.. నూజివీడు ఫస్ట్‌టైమ్.. !




**హైదరాబాద్ పెన్ పవర్:** నూజివీడు రాజకీయాలు ఆసక్తిగా మారాయి. గత ఎన్నికల్లో వైసిపి నుంచి పార్టీ మారి టిడిపిలోకి వచ్చిన కొలుసు పార్థసారథి ఈ నియోజకవర్గంలో విజయం సాధించారు. అయితే ఆయన మంత్రిగా కొనసాగుతున్నప్పటికీ రాజకీయంగా అనేక విమర్శలు వివాదాల్లో చిక్కుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి మాట ఎలా ఉన్నప్పటికీ టిడిపి కార్యకర్తలను కలుపుకొని పోయే విషయంలోనూ కూటమి నాయకులతో వ్యవహరించే విషయంలోనూ ఆయన వెనుకబడ్డారు అన్నది స్పష్టంగా వినిపిస్తున్న మాట.

ఈ నేపథ్యంలో నూజివీడు నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల నాటికి అభ్యర్థిని మార్చాలన్న డిమాండ్ కూటమి పార్టీల మధ్య బలంగా వినిపిస్తోంది. నిజానికి ఎక్కడైనా ఎన్నికలకు ఒక సంవత్సరం ముందు అభ్యర్థిని మార్చాలన్న వాదన తెరమీదకు వస్తుంది. నాయకులు కూడా ఆ తరహా డిమాండ్ చేస్తూ ఉంటారు. కానీ ఇప్పుడు రెండున్నరేళ్లకు ముందే నూజివీడు నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల నాటికి అభ్యర్థిని మార్చాలి అన్న వాదన రావడం గమనార్హం.మరి దీనికి కారణాలు ఏమిటి అనేది మంత్రిగా వ్యవహరిస్తున్న కొలుసు పార్థసారథి ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. కూటమి నాయకులను కలుపుకుని పోకపోవడం ప్రధాన మైనస్ అని ఎక్కువ మంది చెబుతున్నారు. అదే సమయంలో టిడిపి కార్యకర్తలకు ఏమాత్రం విలువ లేకుండా పోయిందనేది కూడా స్థానికంగా వినిపిస్తున్న మాట. ఒకవైపు సీఎం చంద్రబాబు సహా మంత్రి నారా లోకేష్ పార్టీ కార్యకర్తలకు విలువ ఇవ్వాలని వారు పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేశారు కాబట్టి వారికి ప్రాధాన్యం ఇవ్వాలని పదే పదే చెబుతున్నారు.అయినప్పటికీ కొలుసు పార్థసారథి మాత్రం స్థానికంగా ఉన్న నాయకులను పక్కనపెట్టి తనకంటూ ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం ప్రత్యేకంగా గతంలో తనకోసం పనిచేసిన వైసిపి కార్యకర్తలు చేరదీయడం వంటివి ఇప్పుడు కూటమి కార్యకర్తలకు తీవ్ర నిరాశను కలిగిస్తోంది. వాస్తవానికి నూజివీడు నియోజకవర్గం లో వైసిపికి క్యాడర్ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఏమాత్రం కూటమి వెనుకబడినా కూడా వైసిపి పుంజుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోకపోతే కొలుసు పార్థసారథి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ కారణంగానే వచ్చే ఎన్నికల నాటికి అసలు ఆయన సీటునే మార్చాలన్న డిమాండ్ రావడం విశేషం.

# ఇక.. గ్రేటర్ విజయవాడ.. టీడీపీకి లాభమెంత.. ?

**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడ మహానగరాన్ని మరింత విస్తరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న విజయవాడ ను గ్రేటర్ విజయవాడ గా మార్చాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. ఈ క్రమంలో చుట్టుపక్కల ఉన్న 70- 80 గ్రామాల వరకు విజయవాడలో విలీనం చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. తద్వారా విజయవాడ నగర పరిధి భారీ స్థాయిలో పెరగనుంది. దీనిలోకి గన్నవరంలోని పలు ప్రాంతాలు అదేవిధంగా పనమలూరులో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు కూడా కలవనున్నాయి. తద్వారా గ్రేటర్ విజయవాడను విస్తరించి రాజధానికి అనుసంధానం చేయాలన్నది ప్రభుత్వం ఆలోచనగా ఉంది. ఇప్పటికే కృష్ణ నదిపై ప్రకాశం బ్యారేజీకి సమాంతరంగా మరో బ్యారేజీని నిర్మించనున్నారు. దీనికి కూడా టెండర్లు పిలిచారు. తద్వారా విజయవాడ నగరానికి అమరావతికి మధ్య అనుసంధానం ఏర్పడుతుంది. అయితే, గ్రేటర్ విజయవాడ ఏర్పడటం వల్ల రాజకీయంగా టిడిపికి ఎలాంటి ప్రయోజనం జరుగుతుందని ప్రధాన చర్చ. గతంలో జిల్లా విభజన ద్వారా కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా తమ మేలు జరుగుతుందని వైసీపీ అంచనా వేసుకుంది. కానీ గత ఎన్నికల్లో అది విఫలమైన విషయం తెలిసిందే. ఇప్పుడు విజయవాడ ను గ్రేటర్ విజయవాడ గా మార్చడం వల్ల టిడిపికి ఏమైనా ప్రయోజనం ఉంటుందా లేకపోతే అసలు ఏం జరుగుతుంది అనేది ఆ పార్టీకి సంబంధించిన కీలక నాయకుల మధ్య చర్చ నడుస్తోంది. ప్రస్తుతం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అంశాలను తీసుకుంటే ఇటు హైదరాబాద్ దిశగా గొల్లపూడి వైపు, గన్నవరం వైపు వచ్చేసరికి నున్న, అదే విధంగా విజయవాడ బెంజ్ సర్కిల్ దాటిన తర్వాత కానూరు వరకు మాత్రమే ఈ పరిధి విస్తరించి ఉంది.




దీనిని ఇప్పుడు అటు కంకిపాడు వరకు.. ఇటువైపు దాదాపు గన్నవరం దాకా అలాగే గుంటుపల్లి ఇబ్రహీంపట్నం వరకు కూడా విజయవాడ నగర పరిధిని విస్తరించాలని నిర్ణయించుకున్నారు. ఇవన్నీ టీడీపీకి అనుకూలంగా ఉన్న నియోజకవర్గాల్లో జరుగుతున్న మార్పులు కావడంతో తమకు మేలు జరుగుతుందని ఆయా పార్టీ వర్గాల మాట. గ్రామాలను విజయవాడలో కలపాలని కొన్ని గ్రామాల ప్రజలు కోరుతుంటే మరికొన్ని గ్రామాలు మాత్రం వద్దని జిల్లా పరిధిలోనే ఉంటామని చెబుతున్నాయి. ఇట్లా భిన్నమైనటువంటి అంశాలు తెరమీదకు వచ్చాయి. అయినప్పటికీ గ్రేటర్ విజయవాడ ను విస్తరించాలనే దిశగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. దీనివల్ల నగర పరిధి పెరిగి రాజధానికి అనుసంధానం ఏర్పడుతుందని ప్రభుత్వం చెబుతోంది. తద్వారా రాజధాని పరిధిలోనే విజయవాడ నగరం కూడా కొనసాగుతుందని భావిస్తోంది. ఇది పార్టీ పరంగా తమకు మేలు చేస్తుందని నాయకులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియను వచ్చే ఏడాది నాటికి పూర్తిచేయాలని తాజాగా విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం స్పష్టం చేసింది. గన్నవరం, నూజివీడు, పెనమలూరు, మైలవరం వంటి కీలక నియోజకవర్గాలకు సంబంధించిన 70 నుంచి 80 గ్రామాలు విజయవాడలో విలీనం కానున్నాయి. తద్వారా విజయవాడ నగరపాలక సంస్థకు ఆదాయం పెరగడంతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతుందని రహదారులు విద్యుత్ సౌకర్యం ఇంటింటికి నీరు పారిశుధ్యం మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తుంది. అంతేకాదు రాజధానికి అనుసంధాన నగరంగా కూడా విజయవాడ ఉంటుందని అంచనా వేస్తోంది.

# చోడవరం.. తమ్ముళ్ల గరం - గరం రీజన్ ఇదే.. !




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి విశాఖపట్నం (ప్రస్తుతం అనకాపల్లి) లోని చోడవరం నియోజకవర్గం టిడిపిలో టికెట్ పోరు తీవ్రంగా సాగుతోంది. వచ్చే ఎన్నికల నాటికి ఈ టికెట్టు దక్కించుకునేందుకు ఇద్దరు బలమైన నాయకుల మధ్య ఆధిపత్యం, అధికారం కూడా బలమైన ప్రభావం చూపిస్తుంది. గత ఎన్నికల్లో సీనియర్ నాయకుడు గతంలో రెండుసార్లు విజయం సాధించిన కె ఎస్ ఎన్ ఎస్ ఎన్ రాజుకు పార్టీ అధిష్టానం టికెట్ ఇచ్చింది. వాస్తవానికి అప్పటివరకు ఆయన రేసులో లేరు. అంతేకాదు ఆయన రాజకీయంగా కూడా ఇక తప్పుకుంటారు అన్న చర్చ నడిచింది.కానీ అనూహ్యంగా 2024 ఎన్నికల్లో రాజుకు టికెట్ ఇస్తూ చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీనికి ముందు పార్టీలో యాక్టివ్ గా పని చేసిన తాతయ్య బాబు ఈ టికెట్ కోసం పట్టుబట్టారు. తనకే వస్తుందని కూడా ప్రచారం చేసుకున్నారు. అప్పటికే ఆయన దాదాపు 5 నుంచి 10 లక్షల రూపాయల దాకా ఖర్చు చేసి ప్రచారానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో పార్టీ అధిష్టానం పక్కనపెట్టి రాజుకు అవకాశం కల్పించింది. దీంతో తీవ్ర నిరాశకు గురైన తాతయ్య బాబు పార్టీ అధిష్టానం దగ్గర పంచాయతీ పెట్టారు.

దీంతో ఆయనకు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం ఆయన అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల నాటికి టికెట్ తనకే దక్కుతుందని తాతయ్య బాబు ప్రచారం చేసుకుంటున్నారు. ఇదే ఇప్పుడు రాజకీయంగా ఇటు ఎమ్మెల్యేకి అటు పార్టీ అధ్యక్షుడిగా ఉన్న తాతయ్య బాబుకు మధ్య వివాదాన్ని చెలరేగేలా చేసింది. వచ్చే ఎన్నికల నాటికి తనకే టికెట్ దక్కుతుందని తాతయ్య బాబు భావిస్తున్నారు. కానీ రాజు మాత్రం ఈ టికెట్ నాదేనని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ పరిణామాలపై ఇరువర్గాల మధ్య పచ్చగడ్డి వేసినా భగ్గుమనేలాగా పరిస్థితి మారిపోయింది. ఎమ్మెల్యే చేపడుతున్న పనులను తాతయ్య బాబు వర్గం విమర్శిస్తుండగా తాతయ్య బాబు వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఎమ్మెల్యే ప్రచారం చేస్తున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉండి ఆయన చేస్తున్నది ఏమి లేదని, పార్టీ పరంగా కార్యకర్తలు కూడా డైలమాలో ఉన్నారని ఎమ్మెల్యే ప్రచారం చేస్తున్నారు. ఇక తాతయ్య బాబు వర్గం మరో విధమైన ప్రచారాన్ని తెరమీదకు తెచ్చింది.వైసీపీలో ఉన్న నాయకులను ఎమ్మెల్యే తన వైపు తిప్పుకొని ప్రచారం చేస్తున్నారని.. పార్టీలో సంస్థగతంగా పనిచేసిన కార్యకర్తలు నాయకులను ఆయన దూరం పెట్టారని చెబుతున్నారు. దీని వల్ల పార్టీ బలహీనపడుతుందని ఆవర్గం చెబుతోంది. మొత్తంగా ఈ ఇద్దరు మధ్య ఉన్న టిక్కెట్ వ్యవహారం జిల్లాలో రాజకీయాలను బలహీనపరిచేలా చేస్తుంది అన్నది ప్రధాన విమర్శ. అంతేకాదు దీనిపై పార్టీ అధిష్టానానికి కూడా ఫిర్యాదులు అందాయి. ప్రస్తుతం తాతయ్య బాబు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షుడుగా కూడా ఉన్నారు.

# కొత్త LPG కోసం అప్లై చేసినవారికి షాక్.. వస్తుందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో కొత్త గ్యాస్ కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్న వారికి ఆయిల్ కంపెనీలు షాకిచ్చాయి. గృహ, వాణిజ్య అవసరాల కోసం ఇచ్చే కొత్త ఎల్పీజీ కనెక్షన్ల మంజూరును తాత్కాలికంగా నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తులతో పాటు, గతంలో అందిన అప్లికేషన్లను కూడా పెండింగ్‌లో పెట్టడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. అసలు గ్యాస్ సరఫరాలో ఎందుకు సమస్యలు వచ్చాయి? ఈ బ్రేక్ ఎన్నాళ్లు ఉంటుంది? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**కొత్త కనెక్షన్లకు బ్రేక్.. ఆన్‌లైన్ దరఖాస్తులు బంద్:**

సాధారణంగా గ్యాస్ కనెక్షన్ కావాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే కొన్ని రోజుల్లోనే ఇంటికి సిలిండర్ వచ్చేది. కానీ ఇప్పుడు సీన్ మారింది. ఇరాన్-అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధ మేఘాల వల్ల గ్యాస్ ఉత్పత్తి మరియు రవాణాపై తీవ్ర ప్రభావం పడింది. దీనివల్ల దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత ఏర్పడటంతో ఆయిల్ కంపెనీలు కొత్త కనెక్షన్ల ప్రక్రియను పూర్తిగా నిలిపివేశాయి. ప్రస్తుతం ఉన్న వినియోగదారులకే గ్యాస్ అందించడం సవాలుగా మారడంతో, కొత్త వారికి ఇచ్చే మంజూరు పత్రాలను హోల్డ్‌లో పెట్టాయి.

**'మహాలక్ష్మి' పథకం దరఖాస్తుల పరిస్థితి ఏంటి?:**

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' గ్యాస్ పథకంపై కూడా ఈ ప్రభావం గట్టిగానే పడింది. తక్కువ ధరకే గ్యాస్ సిలిండర్ అందించే ఈ పథకం కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయితే, ఆయిల్ కంపెనీల నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో ప్రభుత్వం కూడా కొత్త దరఖాస్తులను ప్రాసెస్ చేయలేకపోతోంది. ఇప్పటికే ఉన్న అప్లికేషన్లను సైతం ఆమోదించకుండా పక్కన పెట్టడంతో, పేద ప్రజలు సబ్సిడీ గ్యాస్ కోసం మరికొంత కాలం వేచి చూడక తప్పని పరిస్థితి నెలకొంది.

**అంతర్జాతీయ యుద్ధం.. స్థానిక గ్యాస్ కష్టాలు:**

మనం వాడుతున్న గ్యాస్‌లో ఎక్కువ భాగం విదేశాల నుంచే దిగుమతి అవుతుంది. ప్రస్తుతం ఇరాన్ మరియు అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల వల్ల సముద్ర మార్గాల్లో గ్యాస్ రవాణాకు ఆటంకాలు కలుగుతున్నాయి. సరఫరా గొలుసు దెబ్బతినడంతో గ్యాస్ నిల్వలు తగ్గిపోయాయి. అందుకే ఉన్న గ్యాస్‌ను పొదుపుగా వాడాలని, కొత్త వారికి ఇప్పుడే కనెక్షన్లు ఇవ్వలేమని అధికారులు చెబుతున్నారు. ఇది కేవలం గృహ వినియోగదారులకే కాదు, హోటళ్లు మరియు వాణిజ్య వ్యాపారులకు కూడా పెద్ద ఇబ్బందిగా మారింది.

**గ్యాస్ కష్టాల నుంచి గట్టెక్కేది ఎప్పుడు?:**

మొత్తానికి అంతర్జాతీయ పరిస్థితులు మన వంటగదిపై ప్రభావం చూపుతున్నాయి. కొత్త ఎల్పీజీ కనెక్షన్ కోసం ఆశగా ఎదురుచూస్తున్న వారికి ఈ వార్త నిజంగా చేదు నిజమే. యుద్ధ పరిస్థితులు సద్దుమణిగి, గ్యాస్ రవాణా సాధారణ స్థితికి వచ్చే వరకు ఈ ఆంక్షలు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక అప్పటివరకు పాత దరఖాస్తుదారులకు కూడా గ్యాస్ అందుతుందా లేదా అన్నది సందేహమే. ఇక పరిస్థితులు మారే వరకు గ్యాస్ వినియోగంలో అందరూ జాగ్రత్తగా ఉండటం మంచిది. ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ప్రజలు కోరుతున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ట్రంప్‌నకు కెనడా ప్రధాని షాక్

**హైదరాబాద్ పెన్ పవర్:** కెనడా నూతన ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఒక కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు కెనడా సైనిక వ్యయం లేదా రక్షణ బడ్జెట్‌లో 70 శాతం అమెరికాకు వెళ్లేదని, ఇకపై అలా జరగదని స్పష్టం చేశారు. ఈ డబ్బును కెనడాలోనే ఉండే కెనడియన్ ప్రజలు, కంపెనీల కోసం ఖర్చు చేయనున్నట్టు ప్రకటించారు. కెనడా ఇకపై "బై కెనడియన్" (కెనడియన్ ఉత్పత్తులనే కొనండి) విధానాన్ని అవలంబిస్తుందని ఆ దేశ ప్రధాని కార్నీ ప్రకటించారు. దీని అర్థం ఏమిటంటే.. కెనడా కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేసినా, కెనడియన్ కంపెనీలు, కెనడియన్ సరఫరాదారులకు మొదటి అవకాశం లభిస్తుంది. అమెరికన్ కంపెనీలు గతంలో పొందిన ప్రయోజనాలను ఇకపై పొందలేవు. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారు? అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, కెనడా మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. కెనడాపై ట్రంప్ వివిధ సుంకాలను విధించారు. కెనడా గురించి అనేక వివాదాస్పద ప్రకటనలు చేశారు. దీనికి ప్రతిస్పందనగా.. కెనడా నూతన ప్రధాన మంత్రి కార్నీ మాట్లాడుతూ.. తమ దేశ ప్రయోజనాలను కాపాడటానికి తాను కఠినమైన నిర్ణయాలు తీసుకోగలనని నిరూపించడానికి ప్రయత్నించారు. తన ప్రసంగంలో కార్నీ? కెనడా ప్రజలకు అండగా నిలుస్తానని, కొత్త ప్రభుత్వం వారితోనే ఉందని పేర్కొన్నారు. కెనడాను బలోపేతం చేయడానికి ఇకపై కెనడియన్ ఉక్కు, కెనడియన్ అల్యూమినియం, కెనడియన్ కలప, కెనడియన్ కార్మికులను ఉపయోగిస్తామని ఆయన తెలిపారు. ఇది ఒక విధంగా, తమ దేశానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్న సందేశమని పేర్కొన్నారు.

# హార్ముజ్‌ను దిగ్బంధించండి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో చర్చలు విఫలమైన వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. "హర్మ్యూజ్‌ను దిగ్బంధించాలని మా దేశ నౌకాదళాన్ని ఆదేశించాం. జలసంధిలోకి నౌకలు ప్రవేశించకుండా లేదా నిష్క్రమించకుండా అమెరికా నౌకలు అడ్డుకోవడం మొదలుపెడతాయి. అంతర్జాతీయ జలాల్లో ఇరాన్‌కు సుంకం చెల్లించిన ప్రతి నౌకను వెంబడిస్తాం. చట్టవిరుద్ధమైన టోల్ చెల్లింపులు జరిపినా ఎవరికీ అంతర్జాతీయ సముద్రాలపై సురక్షితమైన ప్రయాణం ఉండదు. సరైన సమయంలో ఇరాన్‌ను అంతం చేయడానికి సిద్ధంగా ఉన్నాం." అని పేర్కొన్నారు. హార్ముజ్‌ను తెరుస్తామని ఇరాన్ వాగ్దానం చేసినా, మాటతప్పిందన్నారు. ఇరాన్ చర్యలతో అనేక దేశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. జలసంధిని వెంటనే తెరవాలని అన్నారు. చర్చల్లో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ అణుశక్తి విషయంలో అంగీకారం కుదరలేదని ట్రంప్ పేర్కొన్నారు. అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేకపోవడం వల్లే చర్చలు బెడిసికొట్టాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కనివ్వనని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేన నాశనమైందని? గగనతల రక్షణ, రాడార్ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు. ఖమేని సహా అనేకమంది ఇరాన్ నేతలు మరణించారని, ఇదంతా వారి అణ్వాయుధాల ఆశయం వల్లేనని తెలిపారు. హర్మ్యాజ్ దిగ్బంధనం త్వరలో ప్రారంభమవుతుందని, ఇందులో ఇతర దేశాలు కూడా భాగస్వాములవుతాయని అన్నారు. చట్టవిరుద్ధంగా ఇరాన్ ప్రయోజనం పొందడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అన్నారు.

# హార్ముజ్‌లో కదులుతున్న నౌకలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్న నేపథ్యంలో హార్ముజ్ జలసంధిలో చమురు నౌకలు ఇప్పుడిప్పుడే నెమ్మదిగా కదులుతున్నాయి. లిబియా పతాకంతో సెరిఫోస్, చైనా పతాకంతో కాస్పెరల్ లేక్, హీ రంగ్ హారు నౌకలు హర్మ్యాజ్‌ను దాటాయి. వీటిలో ప్రతి నౌకకు రెండు మిలియన్ బ్యారల్స్ చమురును రవాణా చేయగల సామర్థ్యం ఉంది. థాయిలాండ్‌కు చెందిన ఏడు చమురు నౌకలు ఇరాన్ అనుమతుల కోసం హర్మ్యాజ్‌లో నిలిచి ఉండగా వాటిలో ఒకటైన సెరిఫోన్‌కు క్లియరెన్స్ లభించింది. ఈ నౌక సౌదీ అరేబియా నుంచి యుఎఇకి చమురు తీసుకొని మార్చిలో బయలుదేరింది. సెరిఫోన్ ఈ నెల 21న మలేసియాలోని మలక్కా ఓడరేవుకు చేరుకునే అవకాశం ఉంది. ఓషన్ థండర్ అనే నౌక ఇరాక్ ముడి చమురుతో గత వారమే హార్ముజ్‌ను దాటింది. ఇరాక్ చమురును రవాణా చేస్తున్న కాస్పరల్ లేక్ నౌక తూర్పు చైనాలోని జౌషన్ ఓడరేవుకు మే 1న చేరుకుంటుంది. సౌదీ ముడి చమురుతో హర్మ్యాజ్‌ను దాటిన హీ రంగ్ హారు నౌక ఎక్కడికి వెళుతోందో తెలియడం లేదు.

# సియాటెల్‌లో వివేకానందుడి విగ్రహావిష్కరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలోని సియాటెల్‌లో తొలిసారిగా స్వామి వివేకానందుడి లైఫ్-సైజ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. పట్టణంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన వెస్ట్‌లేక్ స్క్వేర్ వద్ద ఈ విగ్రహాన్ని నగరపాలక ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అమెరికాలో స్థానిక ప్రభుత్వం వివేకానందుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని అధికారులు తెలిపారు. సియాటెల్‌లోని భారత రాయబారి ప్రకాశ్ గుప్తా, నగర మేయర్ కేట్ విల్సన్ సంయుక్తంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ విల్సన్ మాట్లాడుతూ ఈ స్మారక విగ్రహం సియాటెల్ నగర సమ్మిళిత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, భారత్‌కు ఈ నగరానికి మధ్య ఉన్న సాంస్కృతిక సంబంధాలను బలపరుస్తుందని తెలిపారు. నగరంలోని భారత రాయబార కార్యాలయం 'చికాగో 1893 నుంచి సియాటెల్ 2026 వరకు! ఈ విగ్రహం సియాటెల్ నగరానికి నూతన భారతీయ చిహ్నం' అని ఒక ప్రకటనలో తెలిపింది. సియాటెల్ బహుళ సాంస్కృతిక స్వభావం, సమ్మిళిత స్ఫూర్తికి గుర్తింపుగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్) ఈ విగ్రహాన్ని బహుమతిగా ఇచ్చిందని ఈ ప్రకటనలో తెలిపింది. ఐసిసిఆర్ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అమెజాన్ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఏర్పాటుచేసిన ఈ విగ్రహాన్ని భారత శిల్పి నరేష్ కుమార్ కుమావత్ రూపొందించారు. సియాటెల్ నగరాన్ని ప్రతిరోజూ 4 లక్షల మందికిపైగా పర్యాటకులు సందర్శిస్తారని ఒక అంచనా. వారందరికీ వివేకానందుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి గ్రేటర్ సియాటెల్ పరిధిలోని నగరాల మేయర్లు, వివిధ కమ్యూనిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో ప్రవాస భారతీయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారత్ నుంచి వెళ్లిన కళాబృందాలు ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చాయి.

# తైవాన్‌తో సంబంధాల పునరుద్ధరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** తైవాన్‌తో నిలిపివేసిన కొన్ని సంబంధాలను పునరుద్ధరిస్తామని చైనా ప్రకటించింది. చైనా కమ్యూనిస్ట్ పార్టీ (సీపీసీ) ప్రధాన కార్యదర్శి షీ జిన్‌పింగ్, కేంద్ర కమిటీ సభ్యులకు, చైనా కువోమింటాంగ్ (కేఎంటీ) పార్టీ
అధ్యక్షురాలు చెంగ్ లి-వున్, ప్రతినిధులకు మధ్య శుక్రవారం బీజింగ్‌లో సమావేశం జరిగింది. కేఎంటీ బృందం పర్యటన బీజింగ్ సహా చైనాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా సీపీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. చైనా, తైవాన్‌లోని వివిధ ప్రాంతాల మధ్య విమాన సర్వీసులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. తైవాన్‌లోని వ్యవసాయ, మత్స్య ఉత్పత్తులుసహా నాణ్యమైన వస్తువులపై ఉన్న ఆంక్షలను తొలగించి, చైనా మార్కెట్లలోకి అనుమతించనున్నారు. సీపీసీ, కేఎంటీల మధ్య ఒక
క్రమబద్ధమైన సంప్రదింపుల యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. తైవాన్‌కు అత్యంత సమీపంలోని ప్రధాన భూభాగ ప్రాంతమైన ఫుజియాన్ ప్రావిన్స్‌లోని తీర ప్రాంతాలకు, సముద్రతీర ద్వీపాలు కిన్మెన్, మాట్సులకు విద్యుత్, గ్యాస్ సరఫరా అందించాలని, భవిష్యత్‌లో వాటికి సముద్ర వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు పేర్కొంది. 1992 ఏకాభిప్రాయానికి కట్టుబడి ఉండాలని, "తైవాన్ స్వాతంత్ర్యాన్ని" వ్యతిరేకించడం అనే ఉమ్మడి రాజకీయ అవగాహన మేరకు ఇరు పార్టీలు చర్యలు తీసుకోవాలని నిర్ణయించాయి.

# రాజకీయ లబ్ధికే ఆదరాబాదరగా సమావేశాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆదరాబాదరాగా అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నించ డాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం తీసుకుంటున్న చర్యగా కనిపిస్తోందన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఖర్గే లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఎలాంటి వివరాలు వెల్లడించకుండా మళ్లీ తమ సహకారం కోరడం సరికాదని, ఈ చట్టంతో ముడిపడిన కీలకాంశాలపై అర్థవంతమైన చర్చ జరగాలని ఖర్గే తెలిపారు. ఇందుకోసం 'నారీ శక్తి అభియాన్' 2023 సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయం మీకు తెలుసు. ఆ సమయంలో తక్షణం ఈ కీలక చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ తరఫున నేను స్వయంగా కోరాను' అని ఖర్గే గుర్తు చేశారు. నియోజక వర్గాల పునర్విభ జనకు సంబంధించిన వివరాలు వెల్లడించ కుండా విపక్షాల సహకారాన్ని కేంద్రం కోరుతోందని, డీలిమి టేషన్, ఇతర కీలకాంశాలకు సంబంధించిన వివరాలు లేకుండా ఈ చారిత్రక చట్టంపై అర్థవంతమైన చర్చ సాధ్యం కాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని ప్రధాని పేర్కొన్నారని, అయితే అది నిజం కాదని ఖర్గే తెలిపారు. 2026 ఏప్రిల్ 29 తరువాత ఎప్పుడైనా సరే రాజ్యాంగ సవరణలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు, అందరినీ ఏకతాటిపై ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్దేశించినదే అయితే నారీ శక్తి వందన్ అధినియమ్-2023 సవరణతో ముడిపడిన డీలిమిటేషన్‌పై చర్చ జరిపేందుకు ఏప్రిల్ 29 తరువాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఖర్గే సూచించారు.

# మహిళా బిల్లుకు మద్దతివ్వండి



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా రిజర్వేషన్ చట్ట (నారీ శక్తి వందన్ అధినియమ్) సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లేఖ రాశారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్లతో నిర్వహిద్దామని తెలిపారు. 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తో నిర్వహించడం అనివార్యమని లేఖలో ప్రధాని పేర్కొన్నారు. మహిళలు, భవిష్యత్తు తరాల కోసం బాధ్యత తీసుకోవాలని పార్టీలను కోరారు. ఇందుకోసం పార్లమెంటులో చర్చను స్వాగతిస్తున్నామని చెప్పారు. 'మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును ఆమోదించే విషయంలో అందరినీ ఒకేతాటిపైకి రావాలని కోరేందుకు ఈ లేఖ రాస్తున్నాను. పార్లమెంటులో ఎక్కువమంది తమ అభిప్రాయాలను పంచుకోవడం అందరికీ గర్వకారణమవుతుంది. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా, మహిళలు, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను చాటుకునే సందర్భమిది. మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని చాలాకాలంగా సభ్యులు కోరుతున్నారు. వారి ఆకాంక్షలు కార్యరూపంలోకి వచ్చే సమయం ఇప్పుడు వచ్చింది. 140 కోట్ల భారతీయులు, నారీశక్తి సాధించిన విజయం ఇది. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు అంతా కలిసికట్టుగా ముందుకు వస్తారనే పూర్తి నమ్మకం ఉంది' అని మోడీ లేఖలో పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియా విజన్ సాకారం కావాలంటే ఈ ప్రయాణంలో మహిళలు కీలకమైన, చురుకైన పాత్ర పోషించడం అవసరమని పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ ప్రారంభించనున్నట్టు లేఖలో ప్రధాని వివరించారు.

# 'టీ తాగేవారు గోహంతకులు..' సాధ్వి శ్రద్ధా గోపాల్ వివాదాస్పద వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ తాగేవారు గోహంతకులని, హిందువులు టీ తాగకూడదని దీదీగా ప్రసిద్ధి చెందిన మత ప్రచారకురాలు సాధ్వి శ్రద్ధా గోపాల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సాధ్వి శ్రద్ధా తన అనుచరులతో మాట్లాడుతున్నప్పుడు ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టీ తాగేవారిని గోహంతకులతో పోలుస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మత ప్రచారకురాలు శ్రద్ధా గోపాల్ పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "టీ తాగేవారే ఆవులను చంపేవారితో సమానం. మా తలలు పేలిపోయినా సరే మేము టీ తాగము," అంటూ శ్రద్ధా గోపాల్ వ్యాఖ్యానించారు. టీ తాగకపోయినా మనుషులు సజావుగా జీవించగలరని, పూర్వీకులు కూడా టీ లేకుండానే జీవించారని ఆమె అన్నారు. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్థం లేని వ్యాఖ్యలతో సమాజాన్ని విభజించే ప్రయత్నం జరుగుతోందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజల దృష్టిని ఆకర్షించేందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

## ఇరాన్ చర్చలకు వచ్చినా, రాకున్నా ఎలాంటి పట్టింపు లేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో, ఇరాన్ తిరిగి చర్చలకు వచ్చినా, రాకపోయినా తనకు ఎలాంటి పట్టింపు లేదని స్పష్టం చేశారు. ఫ్లోరిడా పర్యటన ముగించుకుని మేరీల్యాండ్‌లోని జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. చర్చల సందర్భంగా ఇరాన్‌కు అణ్వాయుధంపై ఉన్న ఆసక్తి మరోసారి బయటపడిందని ట్రంప్ ఆరోపించారు. "వారికి ఇంకా అణ్వాయుధం కావాలి. ఆ విషయాన్ని వాళ్లు స్పష్టం చేశారు. ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండటానికి వీల్లేదు" అని ఆయన గట్టిగా చెప్పారు. చర్చలు జరుగుతున్నప్పుడే ట్రంప్.. ఒప్పందం కుదిరినా కుదరకపోయినా అమెరికాకే విజయమని వ్యాఖ్యానించడం గమనార్హం. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో వారాంతంలో అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య కాల్పుల విరమణపై ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం ఈ చర్చల్లో పాల్గొంది. అయితే, దాదాపు 21 గంటల పాటు జరిగిన ఈ చర్చలు ఎటువంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయడానికి నిరాకరించడమే చర్చల వైఫల్యానికి కారణమని అమెరికా వర్గాలు తెలిపాయి

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే.

## పెళ్లి వేడుక నుంచి తిరుగు ప్రయాణంలో విషాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరప్రదేశ్‌లో ఘోరరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హాపూర్ ప్రాంతంలో బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లి వేడుక నుంచి తిరిగి వస్తున్న ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ముందున్న ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. ఘటన సమాచారం అందిన వెంటనే అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఎస్పీ జ్ఞానంజయ్ సింగ్ వివరాల ప్రకారం, ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన ట్రక్కును రహదారి నుంచి తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మృతుల కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విషాదంలో మునిగిపోయారు. బస్సులో ప్రయాణిస్తున్న 12 మందిని గుర్తించగా, ఒక వ్యక్తి ఆచూకీ ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. 8 నిమిషాల్లో రూ.8 లక్షల కోట్లు మాయం



అంతర్జాతీయంగా ముంచుకొస్తున్న యుద్ధ భయాలు భారత స్టాక్ మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలు విఫలం కావడం, ముడిచమురు ధరలు ఒక్కసారిగా 100 డాలర్ల మార్కును దాటడంతో ఇన్వెస్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. వారీ మొదటి రోజే (ఏప్రిల్ 13, సోమవారం) దలాల్ స్ట్రీట్ భారీ పతనంతో ప్రారంభమైంది. సెన్సెక్స్, నిఫ్టీలు రెండూ పాతాళానికి పడిపోవడంతో ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోతోంది. ఇస్లామాబాద్‌లో అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన శాంతి చర్చలు ఎటువంటి ఫలితం లేకుండా ముగియడం ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది. దీనికి తోడు ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో యుద్ధం అనివార్యమనే సంకేతాలు వెలువడ్డాయి. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర ఒక్కసారిగా 100 డాలర్ల మార్కును దాటిపోయింది. భారత్ తన చమురు అవసరాల కోసం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతుంది కాబట్టి, చమురు ధరల పెరుగుదల మన ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బగా మారింది. సోమవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1613 పాయింట్లు క్షీణించి 75,937 స్థాయి వద్ద ట్రేడవుతోంది. అటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 461 పాయింట్లు నష్టపోయి 23,589 వద్ద కీలక మద్దతు స్థాయిని కోల్పోయింది. ముడిచమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి, ద్రవ్యోల్బణం భారంగా మారుతుందన్న భయంతో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటో, ఐటీ రంగాల షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. భారత మార్కెట్లే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల సూచీలు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. జపాన్ కు చెందిన నికాయ్ 0.84 శాతం పడిపోగా, దక్షిణ కొరియా కోస్పి 1.83 శాతం మేర నష్టపోయింది. హాంగ్ కాంగ్ కి చెందిన హాంగ్ సెంగ్ కూడా 1.16 శాతం బలహీనపడింది. ఇక వాల్ స్ట్రీట్ పరిస్థితి చూస్తే.. అమెరికా ఫ్యూచర్స్ భారీ అమ్మకాలను ఎదుర్కొంటున్నాయి. డౌ జోన్స్ ఫ్యూచర్స్ 550 పాయింట్లు, నాస్‌డాక్ ఫ్యూచర్స్ 320 పాయింట్లకు పైగా క్షీణించి ట్రేడవుతున్నాయి.

# తులం బంగారం ధర చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే

అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చితి నెలకొన్నప్పుడు ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు విఫలం కావడం, హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించడం వంటి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం భయాలను పెంచాయి. దీని ప్రభావంతో స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతుండగా, బంగారం ధరలు మాత్రం రికార్డు స్థాయిలకు చేరుతున్నాయి. నేడు భారతీయ మార్కెట్లో 24 క్యారెట్ల (మేలిమి) బంగారం ధర పది గ్రాములకు రూ.1,52,830 వద్ద పలుకుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో బంగారం ధరలు ఒకే రకంగా ఉన్నాయి. ఇక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,830 కాగా, ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,090 కు చేరింది. అంటే దాదాపు లక్షన్నర రూపాయలకు దగ్గరగా పసిడి రేటు ఉండటంతో పెళ్లిళ్ల సీజన్లో ఉన్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నైలో మాత్రం ధరలు వీటికంటే కాస్త ఎక్కువగా (రూ.1,53,810) ఉన్నాయి. బంగారంతో పోటీ పడుతూ వెండి కూడా భారీగానే పెరుగుతోంది. దేశీయ మార్కెట్లో నేడు కిలో వెండి ధర రూ.2,64,900 వద్ద ఉంది. అంటే గ్రాము వెండి ధర సుమారు రూ.264.90 పలుకుతోంది. పారిశ్రామికంగా వెండికి డిమాండ్ పెరగడం, ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో వెండి ధరలు కూడా వచ్చే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బంగారం ధరలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పటికీ, యుద్ధ మేఘాలు తొలగిపోకపోతే ఇవి ఇంకా పెరిగే



ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ధర తగ్గినప్పుడల్లా కొంచెం కొంచెం కొనుగోలు చేసే బై ఆన్ డిప్స్ పద్ధతిని పాటించాలని సూచిస్తున్నారు. అయితే స్థానిక డిమాండ్, రాష్ట్ర పన్నులు, మేకింగ్ ఛార్జీల బట్టి మీరు కొనే జువెలరీ షాపులో ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.

# చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తాం



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది. చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు.

ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణను దుర్వినియోగం చేసి ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య జరుగుతున్న ఈ పోరాటం ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. సరఫరా గొలుసును ప్రభావితం చేయడంతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కూడా దారితీయవచ్చు. ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చైనా సహకారం ఒక అడ్డంకిగా ఉంది. ఈ పరిస్థితుల్లో, వాణిజ్య సుంకాలను పెంచడం ద్వారా ట్రంప్ చైనాపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ చర్యలు కొత్త వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# క్లిష్ట పరిస్థితుల్లో ఎయిరిండియా

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం, అంతర్గత నాయకత్వ మార్పుల నేపథ్యంలో ఎయిర్ ఇండియా ప్రస్తుతం ఒక క్లిష్ట దశను ఎదుర్కొంటోందని టాటా సన్స్ చైర్మెన్ ఎన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన ఉద్యోగుల అంతర్గత సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యుద్ధం కారణంగా విమాన సర్వీసుల రద్దు, మార్గాల మార్పు, పెరిగిన ఇంధన ధరలు సంస్థపై తీవ్ర ఒత్తిడి పెంచాయని వివరించారు. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతానికి విమాన రాకపోకలు 30 శాతానికి పడిపోయాయని తెలిపారు. యూరప్ వెళ్లే విమానాలు ఆఫ్రికా మీదుగా సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ సంస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో చేపట్టిన దీర్ఘకాలిక మార్పులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. గడిచిన నాలుగేండ్లలో సుమారు 17,000 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోవడం, నాలుగు ఎయిర్‌లైన్స్‌ను రెండుగా విలీనం చేయడం, విమానాల్లో అత్యాధునిక సదుపాయాలను కల్పించడం వంటి కీలక మార్పులు జరిగాయని వివరించారు. సంస్థ నిర్వహణలో భద్రత అనేది అత్యంత కీలకమని, దీనిపై ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పునరుద్ఘాటించారు. విమానంలో మొదటి వరుసలో ఉన్న వారితో పాటు చివరి వరుసలో కూర్చున్న ప్రయాణికులకు కూడా సమానమైన గౌరవం, మర్యాద దక్కాలన్నదే తమ ప్రధాన విధానమని ఆయన ఉద్యోగులకు వివరించారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో




ఉద్యోగులు చూపుతున్న పట్టుదల అభినందనీయమని.. టాటా గ్రూప్ ఎల్లప్పుడూ ఎయిర్ ఇండియాకు అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. బయట నుండి వచ్చే విమర్శలను సానుకూలంగా స్వీకరించి ఒకవేళ అవి సహేతుకమైతే లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేసి సంస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని చంద్రశేఖరన్ కోరారు. కస్టమర్ సంతృప్తిని పరమావధిగా పెట్టుకుని ముందుకు సాగాలని ఆయన కోరారు.

## ఈ ఆర్థిక సంవత్సరంలో 25,000 మంది ఫ్రెషర్ల నియామకం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోబోతున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. గిరాకీ ఆధారంగా మరింత మందిని నియమించుకుంటామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో టీసీఎస్ 44,000 మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ ఏమైనా మార్పులు చేసిందా? అని కృతివాసన్‌ను ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి శిక్షణ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా మారడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాల ఆధారంగా నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు. 2025-26లో 12,000 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించింది. కంపెనీలో మెరుగైన పని తీరు కనబరిచినంత వరకు కెరీర్‌కు ఇబ్బంది ఉండదని కృతివాసన్ భరోసా ఇచ్చారు. గత ఏడాది కోతలకు, కృత్రిమ మేధ (ఏఐ) కారణమన్న వాదనలను తోసిపుచ్చారు. తొలగించిన ఉద్యోగుల్లో చాలా మంది సీనియర్ లెవల్‌కు చెందిన వారని తెలిపారు.

## 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా పెంపు




పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన అంతరాయాల మధ్య ఇంధన లభ్యతను నిర్వహించే క్రమంలో మన దేశంలో 5 కిలోల చిన్న ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాను పెంచారు. అలాగే పైప్డ్ సహజ వాయువు (పీఎన్‌జీ) కనెక్షన్లను కూడా పెంచారు. మార్చి 23 నుంచి 13 లక్షలకు పైగా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లను విక్రయించారు. ప్రస్తుతం రోజువారీ విక్రయాలు లక్ష యూనిట్లను అధిగమించాయి. వలస కార్మికులు, తక్కువ ఆదాయ వినియోగదార్లు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. మార్చి నుంచి 4,24,000 కొత్త పీఎన్‌జీ కనెక్షన్లను యాక్టివేట్ చేశారు. పరివర్తనలో భాగంగా 30,000 మందికి పైగా వినియోగదార్లు ఎల్‌పీజీ కనెక్షన్లను సరెండర్ చేశారు. ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం: పశ్చిమాసియాలో యుద్ధం మొదలై ఆరు వారాలు కావడంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు నెలకొన్నాయి. మన దేశం సగానికి పైగా ముడి చమురును, 40 శాతం గ్యాస్‌ను, 85-90 శాతం ఎల్‌పీజీని ఈ ప్రాంతం నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశ అవసరాల కోసం ఇతర ప్రాంతాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నా, ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం ఉంది. దీంతో ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య వినియోగదార్లకు సరఫరాలో కోతలు విధిస్తూ, గృహ వినియోగదార్లకు ఎల్‌పీజీ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చింది. వంట గ్యాస్ ఎల్‌పీజీ కనెక్షన్లు లేని వారి కొరతను భర్తీ చేయడానికి మార్కెట్ ధరకు లభించే 5 కిలోల సిలిండర్ల సరఫరాను పెంచింది. సంక్షోభానికి ముందు ఫిబ్రవరిలో సుమారు 77,000 అయిదు కిలోల సిలిండర్ల అమ్మకాలు జరగ్గా, గత 2-3 వారాలుగా రోజువారీ అమ్మకాలు లక్ష దాటాయి. గృహ ఎల్‌పీజీ సరఫరాలు మొత్తంగా స్థిరంగా ఉన్నాయని, ఏప్రిల్ 11న 52 లక్షలకు పైగా సిలిండర్లను సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

## ‘ఆధునిక కాలపు హిట్లర్’ నెతన్యాహు

ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును ‘ఆధునిక కాలపు హిట్లర్’గా టర్కీ అభివర్ణించింది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ వ్యాఖ్యలపై ఇరు దేశాల మధ్య పెరుగుతున్న మాటల యుద్ధంపై టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్ సైనిక చర్యలను, పాలస్తీనా సమస్యపై దాని వైఖరిని ఎర్డోగాన్ తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ప్రభుత్వం ముందుకు రావడంతో ఈ వివాదం మరింత తీవ్రమైంది. ఎర్డోగాన్‌పై ఇజ్రాయిల్ చేసిన విమర్శలకు ప్రతిస్పందనగా, టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ నెతన్యాహును నాజీ నియంత హిట్లర్‌తో పోల్చింది. గాజా మరియు మధ్యప్రాచ్యంలో జరిగిన మారణకాండలకు నెతన్యాహు సమాధానం చెప్పాల్సి ఉంటుందని కూడా టర్కీ ఒక ప్రకటనలో పేర్కొంది.ఎర్డోగాన్ వ్యాఖ్యలు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఇజ్రాయిల్ విమర్శించింది. ఈ ప్రాంతంలో శాంతి ప్రయత్నాలను టర్కీ దెబ్బతీస్తోందని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఒకప్పుడు సన్నిహిత రక్షణ, ఆర్థిక సంబంధాలను కలిగి ఉన్న టర్కీ ? ఇజ్రాయిల్ మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో తీవ్రంగా దిగజారాయి. పాలస్తీనా సమస్యపై ఎర్డోగాన్ తీసుకున్న కఠిన వైఖరి మధ్యప్రాచ్య దేశాలలో టర్కీకి పలుకుబడిని పెంచినప్పటికీ, అది ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీసింది. ఈ మాటల యుద్ధం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచుతూ, మధ్యప్రాచ్య రాజకీయాలను మరింత సంక్లిష్టతరం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## భాగస్వామితో తప్పక ఫాలో

# అవ్వాల్సిన రిలేషన్‌షిప్



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో పని ఒత్తిడి, ఇంటి బాధ్యతల మధ్య దంపతులు ఒకరికొకరు సమయాన్ని కేటాయించుకోవడం ఒక సవాలుగా మారింది. దీనివల్ల తెలియకుండానే భాగస్వాముల మధ్య దూరం పెరుగుతుంది, ఇది మానసిక ఒత్తిడికి దారితీస్తుంది. బంధంలో ఆ ఉత్సాహాన్ని, ప్రేమానురాగాలను మళ్ళీ చిగురింపజేయడానికి సోషల్ మీడియాలో ఇప్పుడు ఒక కొత్త సూత్రం విపరీతంగా ట్రెండ్ అవుతోంది. బంధాన్ని బలంగా మార్చేందుకు ఉపయోగపడే సూత్రమే 2-2-2 రూల్. ఇది వినడానికి చాలా సరళంగా ఉన్నా, దీనిని పాటించడం వల్ల దంపతుల మధ్య బంధం మరింత బలపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అసలు ఈ రూల్ వెనుక ఉన్న రహస్యం ఏంటి, దీనిని ఎలా అమలు చేయాలో ఇప్పుడు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. మీ బంధంలో పాత రోజులను మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవడానికి ఈ చిట్కాలు ఎంతగానో తోడ్పడతాయి. ఈ సూత్రం ప్రకారం దంపతులు మూడు ముఖ్యమైన లక్ష్యాలను పెట్టుకోవాలి. 1. ప్రతి రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా ఒక 'డేట్ నైట్' ప్లాన్ చేసుకోవాలి. 2. ప్రతి రెండు నెలలకు ఒకసారి కనీసం ఒక వారాంతం ఎక్కడికైనా విహారయాత్రకు వెళ్లాలి. 3. ప్రతి రెండు ఏళ్లకు ఒకసారి కనీసం ఒక వారం రోజుల పాటు లాంగ్ వెకేషన్ ప్లాన్ చేయాలి. ఈ పద్ధతి వల్ల రోజువారీ ఏకధాటి జీవనశైలి నుండి విరామం దొరుకుతుంది, భాగస్వామితో మనసు విప్పి మాట్లాడుకోవడానికి అవకాశం లభిస్తుంది. 2015లో ఒక రెడిట్ థ్రెడ్ ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ ఆలోచన, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న జంటలకు ఒక ఆయుధంలా మారింది. ఈ రూల్ పాటించేటప్పుడు కొన్ని ముఖ్యమైన విషయాలను గుర్తుంచుకోవాలి. విహారయాత్రలు లేదా డేట్ నైట్స్ అంటే భారీగా ఖర్చు చేయాలని కాదు, మీ ఆర్థిక పరిమితులను బట్టి ప్లాన్ చేసుకోవడం ముఖ్యం. ఇక్కడ ప్రధాన ఉద్దేశ్యం ఖర్చు చేయడం కాదు, నాణ్యమైన సమయాన్ని గడపడం. అలాగే ఒకరు ఇష్టపడే పనిని మరొకరిపై రుద్దకుండా, ఇద్దరికీ ఇష్టమైన వ్యాపకాలను ఎంచుకోవాలి. ఉదాహరణకు ఇద్దరికీ నచ్చే సినిమా చూడటం లేదా కలిసి ప్రశాంతంగా నడవడం వంటివి బంధాన్ని మరింత ధృఢంగా మారుస్తాయి. దీనివల్ల భాగస్వామికి మీరు ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నారో వారికి అర్థమవుతుంది. ఈ 2-2-2 రూల్ బంధంలో ఉండే మొనాటనీని (ఏకసారూప్యతను) బ్రేక్ చేసి కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. అయితే హనీ గుథ్ అనే మరొక కోచ్ ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తు చేశారు, అదే 'ఫ్లెక్సిబిలిటీ'. ఈ రూల్‌ను ఖచ్చితంగా యంత్రంలా పాటించాల్సిన అవసరం లేదు, మీ పనికి ఆటంకం కలగకుండా సర్దుబాటు చేసుకోవాలి. ముఖ్యంగా లాంగ్ డిస్టెన్స్ రిలేషన్‌షిప్‌లో ఉన్నవారికి ఇది ఒక గొప్ప వరప్రసాదం. ఒకరి గురించి ఒకరు మరింత లోతుగా తెలుసుకోవడానికి, భావోద్వేగ పరంగా దగ్గరవ్వడానికి ఈ నియమం పునాదిలా పనిచేస్తుంది. కాబట్టి మీ బిజీ షెడ్యూల్ నుండి కొద్దిగా సమయాన్ని కేటాయించి మీ భాగస్వామితో సంతోషంగా గడపండి. బంధం ఏదైనా దానికి కావాల్సింది కేవలం మీ సమయం, ప్రేమ మాత్రమే. అవే మీ రిలేషన్‌షిప్‌ను చిరకాలం పచ్చగా ఉంచుతాయి.

# బియ్యం, పప్పులు పాడవుతున్నాయా?



బియ్యం, పప్పులు, ధాన్యాలు ఎక్కువ కాలం నిల్వ ఉంచితే వాటిలో రకరకాల పురుగులు పడతాయి. అయితే, వంటింట్లో ఉండే చిన్న చిన్న వస్తువులతోనే ఈ పురుగుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపవచ్చు. రసాయన పురుగుమందుల జోలికి వెళ్లకుండా, మన పూర్వీకులు అనుసరించిన సహజ సిద్ధమైన పద్ధతులతో ధాన్యాలను ఎలా కాపాడుకోవాలి. వంటగదిలో మనం ఎంతో కష్టపడి దాచుకున్న బియ్యం, మినప్పప్పు వంటి ధాన్యాలకు పురుగులు లేదా ముక్కు పురుగులు పట్టడం అనేది గృహిణులకు పెద్ద సమస్య. ఈ పురుగులు కేవలం ఆహారాన్ని పాడు చేయడమే కాకుండా, మన ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతాయి. "ఆహారమే ఔషధం" అని నమ్మే మన సంస్కృతిలో, మనం తినే గింజలను సురక్షితంగా ఉంచుకోవడం మన బాధ్యత. ధాన్యాలను నిల్వ చేసేటప్పుడు పాత్ర ఎంపిక చాలా ముఖ్యం. ఎల్లప్పుడూ స్టెయిన్‌లెస్ స్టీల్ లేదా నాణ్యమైన ప్లాస్టిక్ గాలి చొరబడని డబ్బాలను మాత్రమే వాడాలి. డబ్బాలో తేమ ఉంటే పురుగులు త్వరగా చేరుతాయి, కాబట్టి వాడే ముందు పాత్రను ఎండలో బాగా ఆరబెట్టాలి. ఒక చిన్న తేమ చుక్క ఉన్నా అది పురుగులు గుడ్లు పెట్టడానికి అనుకూలంగా మారుతుంది. మన వంటగదిలో దొరికే ఎండు మిరపకాయలు పురుగులను తోలడంలో అద్భుతంగా పనిచేస్తాయి. బియ్యం లేదా పప్పుల డబ్బాలో 5 నుండి 10 ఎండు మిరపకాయలు వేస్తే, వాటి ఘాటైన వాసనకు పురుగులు దరిచేరవు. అలాగే ఎండిన వేపాకులను ఒక చిన్న గుడ్డలో కట్టి ధాన్యం మధ్యలో ఉంచడం వల్ల అది సహజ క్రిమిసంహారిణిగా పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో 'వసంబు' అనే వేరును ముక్కలుగా చేసి బియ్యం కుండలో వేస్తుంటారు, ఇది నెలల తరబడి పురుగులు రాకుండా కాపాడుతుంది. బియ్యం బస్తాల్లో అక్కడక్కడా బిర్యానీ ఆకులు లేదా లవంగాలు వేయడం వల్ల పురుగులు రావు. పప్పు ధాన్యాలకు కొద్దిగా ఆముదం లేదా పసుపు పొడి రాసి నిల్వ చేస్తే ముక్కు పురుగులు పట్టవు. ఇక భారీ మొత్తంలో అంటే 50 కిలోల బస్తాల్లో నిల్వ చేసే వారు 'ఫుడ్ గ్రేడ్' బోరిక్ యాసిడ్ పౌడర్‌ను బియ్యంతో కలపవచ్చు (అయితే వండే ముందు బియ్యాన్ని బాగా కడగాలి). ప్రతి మూడు నెలలకు ఒకసారి ధాన్యాలను నీడలో ఆరబెట్టి మళ్ళీ నిల్వ చేయడం వల్ల తేమ చేరకుండా ఉంటుంది. మినప్పప్పు, పెసరపప్పు వంటివి త్వరగా పాడవ్వకుండా ఉండాలంటే వాటిని దోరగా వేయించి, చల్లారిన తర్వాత డబ్బాలో భద్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆరు నెలల పాటు పురుగులు పట్టవు సరా, వండేటప్పుడు కూడా పప్పు ఎంతో రుచిగా ఉంటుంది. గింజలను తీసేటప్పుడు ఎప్పుడూ తడి లేని గరిటెనే వాడాలి. మన చేతికి ఉండే తేమ వల్ల కూడా పురుగులు పట్టే అవకాశం ఉందని గుర్తుంచుకోవాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే మీ వంటగదిలోని ధాన్యాలు ఎప్పుడూ తాజాగా, సురక్షితంగా ఉంటాయి.

# ఆమ్లెట్ వేసేటప్పుడు ఈ తప్పులు చేయకండి



మధ్యాహ్న భోజనమైనా, ఉదయం అల్పాహారమైనా.. వేడి వేడి ఆమ్లెట్ ఉంటే ఆ మాజనే వేరు. బ్యాచిలర్స్ నుండి మహిళల వరకు అందరికీ ఇష్టమైన, అత్యంత వేగంగా తయారయ్యే వంటకం ఇది. అయితే తయారు చేయడం సులభమే కదా అని మనం చేసే కొన్ని అశ్రద్ధలు ఈ పోషకాహారాన్ని అనారోగ్యకరంగా మారుస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం రోజూ వేసుకునే ఆమ్లెట్‌ను మరింత రుచిగా, ఆరోగ్యంగా మార్చుకోవడానికి పాటించాల్సిన సూత్రాలు. ఉప్పు కలిపే విషయంలో జాగ్రత్త: మనం చేసే అతిపెద్ద పొరపాటు గుడ్లను గిలకొట్టే ప్రారంభంలోనే ఉప్పు కలపడం. ఇలా చేయడం వల్ల గుడ్డులోని ప్రోటీన్ నిర్మాణం దెబ్బతిని, అది తేమను త్వరగా కోల్పోతుంది. ఫలితంగా ఆమ్లెట్ మృదుత్వాన్ని కోల్పోయి రబ్బరులా లేదా మందంగా తయారవుతుంది. గుడ్డు మిశ్రమాన్ని పెనంపై పోయడానికి కొన్ని సెకన్ల ముందు మాత్రమే ఉప్పు కలపండి. దీనివల్ల ఆమ్లెట్ ఫ్లఫీగా వస్తుంది. కూరగాయలతోనే పోషకాలు: చాలామంది కేవలం గుడ్డును మాత్రమే పగలగొట్టి ఉప్పు, కారం వేసి ఆమ్లెట్ వేసుకుంటారు. కానీ ఇందులో పీచుపదార్థం లోపిస్తుంది. కేవలం గుడ్లను మాత్రమే తీసుకోవడం వల్ల కలిగే అసమతుల్యతను పోగొట్టాలంటే తప్పనిసరిగా కూరగాయలను చేర్చుకోవాలి. ఉల్లిపాయలు, టమోటాలు, పచ్చిమిరపకాయలతో పాటు పాలకూర, క్యాప్సికమ్ లేదా క్యారెట్ తురుమును కూడా వాడవచ్చు. పీచుపదార్థం ఎక్కువగా ఉండే కూరగాయలు చేర్చడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పచ్చిగా వద్దు: ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలను నేరుగా గుడ్డు మిశ్రమంలో వేసి పెనంపై పోస్తే, ఆ తక్కువ సమయంలో కూరగాయలు సరిగ్గా ఉడకవు. దీనివల్ల తింటున్నప్పుడు పచ్చి వాసన రావడమే కాకుండా రుచి తగ్గుతుంది. ముందుగా బాణలిలో కొద్దిగా నూనె లేదా వెన్న వేసి కూరగాయలను దోరగా వేయించాలి. అవి సగం ఉడికిన తర్వాత మాత్రమే సిద్ధం చేసుకున్న గుడ్డు మిశ్రమాన్ని అందులో కలపాలి. ఇలా చేయడం వల్ల కూరగాయల్లోని సహజమైన రుచి ఆమ్లెట్‌కు పడుతుంది. ఆమ్లెట్ లబ హాఫ్ బాయిల్: చాలామంది గుడ్డును పగలగొట్టి రెండు వైపులా కాల్చడాన్ని ఆమ్లెట్ అనుకుంటారు. సాంకేతికంగా ఇది ఆమ్లెట్ కాకపోయినప్పటికీ ఆరోగ్యకరమే. అయితే ఆమ్లెట్ అంటే అన్ని పదార్థాలను సమపాళ్లలో కలిపి ఒక పద్ధతి ప్రకారం వండటం. వండేటప్పుడు మరీ ఎక్కువ నూనె వాడకుండా, తక్కువ మంటపై కాల్చడం వల్ల గుడ్డులోని పోషకాలు ఆవిరి కాకుండా ఉంటాయి. చిన్న మార్పులే పెద్ద ఫలితాలను ఇస్తాయి. ఆమ్లెట్ తయారీలో మీరు ఈ జాగ్రత్తలు పాటిస్తే, అది కేవలం కడుపు నింపే ఆహారమే కాకుండా శరీరానికి అవసరమైన పూర్తిస్థాయి ప్రోటీన్లు, విటమిన్లు అందించే అద్భుతమైన ఆరోగ్య వనరుగా మారుతుంది.

# కొబ్బరి పాల అన్నం ఇలా చేయండి



కొబ్బరి పాల అన్నం మీరు వినే ఉంటారు దీని గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ రెసిపీ దక్షిణ భారత వంటల్లో చాలా ఫేమస్. ఇది టేస్టీ వంటకం కూడా. ముఖ్యంగా, కొబ్బరి పాలు దీనిలో వేయడం వలన ప్రత్యేకమైన రుచి వస్తుంది. కొబ్బరి పాల అన్నం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ రెసిపీ దక్షిణ భారత వంటల్లో చాలా ఫేమస్. ఇది రుచికరమైన వంటకం కూడా. ముఖ్యంగా, కొబ్బరి పాలు దీనిలో వేయడం వలన ప్రత్యేకమైన రుచి వస్తుంది. మీ ఇంట్లో ఉండే వాటితో ఈజీగా చేసుకోవచ్చు. కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు బియ్యం, ఒక కప్పు కొబ్బరి పాలు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర, నాలుగు లవంగాలు, 5 యాలకులు, దాల్చిన చెక్క, ఒక చిన్న ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్, నెయ్యి , నూనెను తీసుకోవాలి. ముందుగా బియ్యాన్నికడిగి 10 నిముషాల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత ఒక పెద్ద పాత్రలో కొద్దిగా నూనె లేదా నెయ్యి వేడి చేసి కొద్దిగా యాలకులు, దాల్చిన చెక్క, జీలకర్ర, లవంగాలు కూడా వేయించి పచ్చి వాసన వచ్చే వరకు బాగా వేయించాలి. ఆ తర్వాత కరివేపాకు ఆకులు, రెండు పచ్చిమిర్చి, కట్ చేసిన ఉల్లిపాయలు వేసి గోల్డ్ రంగు వచ్చే వీటిని బాగా వేయించాలి. ఆ తర్వాత కొద్దిగా అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత బియ్యాన్ని కూడా వేసి కొద్దిసేపు ఉంచి గరిటెతో దానిని తిప్పాలి. ఆ తర్వాత కొబ్బరి పాలు, నీరు కూడా వేసి, రుచిగా సరిపడా ఉప్పు , ఒక స్పూన్ గరం మసాలా కూడా వేసి మిక్స్ అయ్యేలా కలపాలి. ఇప్పుడు మూత పెట్టి మీడియం మంటపై బాగా ఉడికించాలి. చివర్లో కొత్తిమీర వేసి వేడి వేడి తినడమే.

# లైఫ్ క్వాలిటీని పెంచుతున్న చిన్న చిన్న వెకేషన్లు




రోజువారీ పనులు, చదువు లేదా ఉద్యోగం నుంచి అప్పుడప్పుడు విరామం తీసుకుని నచ్చినట్లు గడపడాన్నే వెకేషన్ అంటారు. రిలాక్స్ అవడం, ప్రయాణం చేయడం, కుటుంబంతో టైమ్ స్పెండ్ చేయడం, ఇష్టమైన పనులు చేయడం ఇందులో ఇందులో భాగమే. ఇలా ఏదో ఒక పర్పస్ కోసం ఎక్కువసార్లు వెకేషన్ తీసుకునేవారు జీవితంలో ఎక్కువ సంతోషంగా ఉంటారని ఒక అధ్యయనం పేర్కొన్నది. వెల్‌నెస్ స్టడీలో భాగంగా 9 దేశాల్లో 12 వేలమందిని ప్రశ్నించిన నిపుణులు పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. అవేమిటో చూద్దామా!

ఫ్రెండ్స్‌తోనో, ఫ్యామిలీతోనో కలిసి వెకేషన్ ప్లాన్ చేయడం, ట్రిప్‌కి వెళ్లడం, దగ్గరలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడం ఇలా ప్రతీ ఒక్కటి ఏదో ఒక ప్రయోజనాన్ని కలిగిస్తుందని నిపుణులు అంటున్నారు. పైగా ఇలా వెకేషన్ తీసుకునే వాళ్లు, తీసుకోని వారితో పోలిస్తే జీవితంలో తక్కువ స్ట్రెస్, క్వాలిటీ స్లీప్, ఎక్కువ సంతృప్తి కలిగి ఉంటున్నారని కనుగొన్నారు. కేవలం కేవలం మూడు నుంచి నాలుగు రోజుల చిన్న బ్రేక్‌లు కూడా మానసిక స్థితిని మెరుగు పర్చడంలో, ప్రొడక్టివిటీ పెంచడంలో సహాయపడతాయని, వెకేషన్ నుంచి తిరిగి వచ్చాక ఆ ప్రభావం వారాల పాటు కొనసాగుతుందని గుర్తించారు.

ఇక వెకేషన్ తీసుకునే వారు తక్కువ ఒత్తిడిని ఎందుకు కలిగి ఉంటారంటే.. వెకేషన్లు మనసును పని నుంచి దూరం చేసి, కార్టిసాల్ (ాబితీవబబ ఫ్రనీతీఎనీనివ) లెవెల్స్ తగ్గిస్తాయి. తరచూ చిన్న బ్రేక్‌లు తీసుకుంటే స్ట్రెస్ పేరుకుపోకుండా రెగ్యులర్‌గా రీసెట్ అవుతుంది. బర్న్ అవుట్ తగ్గుతుంది. ఒకే పెద్ద వెకేషన్

తర్వాత స్ట్రెస్ తిరిగి పెరిగే అవకాశం ఎక్కువ. వెకేషన్ సమయంలో రిలాక్స్ అయి, రొటీన్ మార్పు వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. తరచూ బ్రేక్‌లు తీసుకుంటే ఈ ప్రయోజనం ఏడాది పొడవునా కొనసాగుతుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. స్ట్రెస్ తగ్గడం వల్ల నిద్రలేమి సమస్యలు తగ్గి, మానసిక ప్రశాంతత చేకూరుతుంది. యాక్టివ్‌నెస్ పెరుగుతుంది. సాధారణ వ్యక్తులతో పోలిస్తే అప్పుడప్పుడూ వెకేషన్లకు వెళ్లేవారు జీవితంలో ఎక్కువ సంతృప్తిని పొందుతారు. కారణం కొత్త ప్రాంతాల సందర్శన, కొత్త అనుభవాలు ఆనందాన్ని కలిగిస్తాయి. ఇక ట్రిప్ రాబోతోందనే ఆశ కూడా హ్యాపీనెస్‌ను పెంచుతుంది. తరచూ చిన్న ట్రిప్‌లు తీసుకుంటే ఈ బూస్ట్ రిపీట్ అవుతుంది. మొత్తం జీవిత సంతృప్తి పెరుగుతుంది. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ (ంఖం) స్టడీస్ కూడా వెకేషన్లు ఈ విధమైన ప్రయోజనాలను కలిగిస్తాయని పేర్కొన్నది.

# ఆఫీసు పని ఒత్తిడితో సతమతమవుతున్నారా?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆఫీసు డెడ్‌లైన్లు, మీటింగుల మధ్య ఒత్తిడికి గురవ్వడం సహజం. అయితే, ఈ ఒత్తిడి మీ ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా ఉండాలంటే, పని మధ్యలో చిన్న విరామం తీసుకుని ఈ క్రింది 5 నిమిషాల రిలాక్సేషన్ టెక్నిక్స్‌ను ప్రయత్నించండి. కేవలం 5 నిమిషాల పాటు ఈ చిన్నపాటి కదలికలు చేయడం వల్ల పనిలో ఉత్సాహం, ఏకాగ్రత పెరుగుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శ్వాస వ్యాయామం: కళ్లు మూసుకుని నిటారుగా కూర్చోండి. ముక్కుతో గాలిని పీల్చుకుని 4 సెకన్ల పాటు ఆపి, నెమ్మదిగా వదలండి. ఇలా 5 సార్లు చేయడం వల్ల మీ నాడీ వ్యవస్థ ప్రశాంతపడుతుంది. తక్షణ ఉపశమనం లభిస్తుంది. కళ్లకు విశ్రాంతి: డిజిటల్ స్ట్రెయిన్ తగ్గించడానికి పామింగ్ పద్ధతి వాడండి. రెండు అరచేతులను ఒకదానికొకటి వేగంగా రుద్ది, ఆ వెచ్చదనాన్ని కళ్లపై ఉంచుకోండి. ఇది కళ్ల అలసటను తగ్గిస్తుంది. మెడ, భుజాల స్ట్రెచెస్: నిరంతరం కంప్యూటర్ స్క్రీన్ చూడటం వల్ల మెడ నొప్పులు వస్తాయి. నెమ్మదిగా తలను అటు ఇటు తిప్పడం, భుజాలను పైకి కిందకు కదిలించడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి కండరాల నొప్పులు తగ్గుతాయి. సీటెడ్ ట్విస్ట్: కుర్చీలో కూర్చునే మీ శరీరాన్ని కుడి వైపుకు, ఆపై ఎడమ వైపుకు మెల్లగా తిప్పండి. ఇది వెన్నెముకకు మంచి వ్యాయామంలా పనిచేస్తుంది. వెన్నునొప్పి రాకుండా కాపాడుతుంది. నీరు తాగడం, నడక: ఒత్తిడిని తగ్గించడానికి హైడ్రేషన్ చాలా ముఖ్యం. ప్రతి గంటకు ఒకసారి గ్లాసు నీరు తాగండి. వీలైతే సీటు నుండి లేచి ఒక నిమిషం పాటు ఆఫీసులోనే అటు ఇటు నడవండి.

# ముంబై ఇండియన్స్‌కి బిగ్ షాక్.. ఐపీఎల్ నుంచి రోహిత్ ఔట్..



**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఏప్రిల్ 12న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ లో ఐదుసార్లు ఛాంపియన్ గా నిలిచిన ముంబై ఇండియన్స్‌కు చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు చేతిలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. దీంతో ఇప్పటి వరకు 4 మ్యాచ్ లు ఆడిన ముంబై కేవలం ఒక్క మ్యాచ్ లోనే విజయం సాధించి 3 మ్యాచ్ ల్లో ఓడింది. ఈ క్రమంలో ముంబైకి మరో బిగ్ షాక్ తగిలింది. రోహిత్ శర్మకు తొడ కండరాల గాయం (హాంస్ట్రింగ్) జట్టును కష్టాల్లోకి నెట్టింది. ఇన్నింగ్స్ ప్రారంభంలో 13 బంతుల్లో 19 రన్స్ చేసిన హిట్ మ్యాన్, క్రీజులో ఉన్నంతసేపు ఇబ్బంది పడ్డాడు. గాయం తీవ్రత పెరగడంతో, ఫిజియోతో చర్చించిన తర్వాత మైదానాన్ని రోహిత్ శర్మ వీడాల్సి వచ్చింది.

మ్యాచ్ ముగిసిన తర్వాత వెస్టిండీస్ ప్లేయర్ షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ మాట్లాడుతూ.. రోహిత్ శర్మ గాయం ఎంత తీవ్రంగా ఉందో ప్రస్తుతానికి ఖచ్చితంగా చెప్పలేమని తెలిపాడు. ఇది అభిమానుల్లో కొంత ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, తాజాగా అందుతున్న నివేదికల ప్రకారం రోహిత్ శర్మకు వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాడు ఆయనకు స్కానింగ్ పరీక్షలు జరుగుతాయని, ఆ ఫలితాల ఆధారంగానే తదుపరి మ్యాచ్‌లలో ఆడేదానిపై క్లారిటీ వస్తుందని వెల్లడించాడు.

ముంబై ఇండియన్స్ తమ తదుపరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడబోతుంది. జట్టు యాజమాన్యం రోహిత్ విషయంలో ఎలాంటి రిస్క్ తీసుకోవాలని అనుకోవడం లేదు.. ఒకవేళ గాయం స్వల్పమైంది అయినప్పటికీ, ముందు జాగ్రత్త చర్యగా పంజాబ్‌తో జరిగే మ్యాచ్‌లో అతడికి విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. ఐపీఎల్ సుదీర్ఘమైన టోర్నీ కావడంతో, కీలకమైన చివరి దశ మ్యాచ్‌ల కోసం రోహిత్‌ను సంపూర్ణ ఆరోగ్యంతో ఉంచాలని ముంబై ఇండియన్స్ యాజమాన్యం యోచిస్తోంది.

రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ప్లేయర్ దూరం కావడం ముంబై ఇండియన్స్ టీమ్ బ్యాటింగ్ లైనప్‌కు పెద్ద లోటు అని చెప్పొచ్చు. ఓపెనింగ్‌లో అతడు ఇచ్చే మెరుపు ఆరంభాలు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఇప్పుడు రోహిత్ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారు, ముంబై తిరిగి విజయాల బాట ఎలా పడుతుంది అనే అంశం ఆసక్తికరంగా మారింది. ఫ్యాన్స్ మాత్రం తమ అభిమాన ఆటగాడు త్వరగా కోలుకుని మైదానంలోకి రావాలని కోరుకుంటున్నారు.

# రికార్డు స్థాయిలో మహిళల టీ20 వరల్డ్ కప్ ప్రైజ్ మనీ.. విన్నర్స్‌కి రూ. 21 కోట్లు!







**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ సంవత్సరం జూన్‌లో మహిళల టీ20 ప్రపంచ కప్ జరగనుంది. ఇందుకోసం (2026, ఏప్రిల్ 13న) అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) భారీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచినట్లు వెల్లడించింది. 2 నెలల పాటు ఇంగ్లాండ్, వేల్స్‌లో జరిగే ప్రపంచ కప్ కోసం సుమారు 82 కోట్ల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలియజేసింది ఐసీసీ. గత సీజన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెరిగింది. ఈసారి ఈ మెగా టోర్నమెంట్లో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 టీమ్స్ మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12వ నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ కొనసాగనుంది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. కాగా గత వరల్డ్‌కప్‌లో ప్రైజ్‌మనీ 74 కోట్లు ఉండగా, ఈసారి దాన్ని 82 కోట్లకు పెంచినట్లు ఐసీసీ ప్రకటించింది. వరల్డ్‌కప్ విజేతలు ఈసారి 21.8 కోట్ల ప్రైజ్‌మనీ అందుకోనున్నారు. ఇక రన్నరప్ జట్టుకి 10 కోట్ల రూపాయలని ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అయితే సెమీ ఫైనల్లోకి ఎంటరైన టీమ్స్ కి 6.29 కోట్ల రూపాయలు ఇవ్వనుండగా, గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకి రూ. 29 లక్షలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించింది ఐసీసీ. ప్రతి టీమ్ కు కనీసం రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో వెల్లడించింది. జూన్ 12వ తేదీన బర్మింగ్‌హామ్‌లో శ్రీలంక వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య మొదటి మ్యాచ్ జరగనునంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, భారత్, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్ , స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా ఈ మెగా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు జరగనున్నాయి.

# వైభవ్ పక్కనే ఫోన్ వాడిన రాజస్థాన్ మేనేజర్.. బీసీసీఐ షోకాజ్ నోటీసులు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో భాగంగా RCB vs RR మ్యాచ్ సందర్భంగా ఒక సంచలన ఘటన చోటు చేసుకుంది. స్టేడియంలో ఆటగాళ్ల మెరుపులు ఒకెత్తయితే, డగౌట్‌లో జరిగిన ఒక ఘటన ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి భిందర్, మ్యాచ్ జరుగుతుండగా డగౌట్‌లో కూర్చుని మొబైల్ ఫోన్ వాడుతూ కెమెరాలకు చిక్కారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, PMOA (Players and Match Officials Area) పరిధిలోకి వచ్చే డగౌట్‌లో ఫోన్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వాడటం పూర్తిగా నిషేధం.

రాజస్థాన్ జట్టు మేనేజర్ రోమి భిందర్ ఫోన్ చూస్తుండటం, పక్కనే యంగ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ కూడా ఆ స్క్రీన్ వైపు ఆసక్తిగా చూడటం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిని యాంటీ కరప్షన్ (ACU) నిబంధనల ఉల్లంఘనగా పరిగణించిన బీసీసీఐ, 48 గంటల్లో వివరణ ఇవ్వాలని అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయితే రోమి భిందర్ ఏదో ఆరోగ్య సమస్య కారణంగానే ఫోన్ దగ్గర ఉంచుకున్నారని, దీని కోసం ముందే అనుమతి కోరారని సమాచారం. కానీ, అనుమతి ఉన్నా లేకపోయినా డగౌట్‌లో ఫోన్ వాడటం నిబంధనలకు విరుద్ధం కావడంతో బీసీసీఐ విచారణను వేగవంతం చేసింది. బీసీసీఐ రూల్స్ బ్రేక్ చేసినట్లు తేలితే గనుక, భిందర్‌పై అధికారిక హెచ్చరిక, భారీ జరిమానా లేదా కొన్ని మ్యాచ్‌ల పాటు సస్పెన్షన్ విధించే ఛాన్స్ ఉంటుంది. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ ఈ ఉదంతంపై సమగ్ర విచారణ జరిపిన తర్వాత నివేదిక సమర్పించాలని ఏసీయూను ఆదేశించినట్లు తెలుస్తుంది.

# నిజంగా రాముడే దిగొచ్చాడా అనుకున్నా!







బాలీవుడ్ లో అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం –రామాయణ్–. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న పౌరాణిక గాథపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా సినిమాలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్ నటిస్తుండటంతో? ఆయన పాత్ర ఎలా ఉండబోతుందా? అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సెట్‌లో రణబీర్‌ను రాముడి గెటప్‌లో చూసిన నటి సురభి దాస్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న సురభి దాస్ షూటింగ్ సెట్‌లో రణబీర్ కపూర్‌ను చూసిన మొదటి క్షణాన్ని గుర్తు చేసుకున్నారు. రణబీర్ రాముడి గెటప్‌లో నడుచుకుంటూ వస్తుంటే? ఒక్క క్షణం తాను తన కళ్ళను తానే నమ్మలేకపోయానని వెల్లడించారు. –నిజంగా ఆ శ్రీరాముడే సాక్షాత్తు భూమి మీదకు దిగి వచ్చాడా? అన్నంత గొప్పగా రణబీర్ ఆహార్యం ఉందని మనసులో అనుకున్నాను. ఆయన కళ్ళలో ప్రశాంతత, గంభీరమైన రూపం చూసి తాను మంత్రముగ్ధురాలినయ్యానని పేర్కొన్నారు. రణబీర్ కపూర్ ఈ పాత్ర కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు. కేవలం బాహ్యరూపం మాత్రమే కాకుండా? శ్రీరాముడి వ్యక్తిత్వాన్ని ఆకళింపు చేసుకోవడానికి మాంసాహారాన్ని మానేసి, మద్యానికి దూరంగా ఉంటూ కఠినమైన నియమాలు పాటిస్తున్నారు. ఈ క్రమశిక్షణే ఆయన ముఖంలో ప్రత్యేకమైన తేజస్సును తీసుకువచ్చిందని, అది సెట్‌లోని అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని సురభి వ్యాఖ్యానించారు. నటుడిగా రణబీర్ తనను తాను మలుచుకున్న తీరు అద్భుతమని ఆమె కొనియాడారు. దర్శకుడు నితేష్ తివారీ ఈ చిత్రంలోని ప్రతి పాత్రను, ప్రతి సన్నివేశాన్ని అత్యంత సహజంగా, భక్తిభావం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ , సెట్స్ పరంగా ఎక్కడా రాజీ పడకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో రామాయణ్ రూపొందుతోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో లీక్ అయిన కొన్ని ఫోటోలు రణబీర్ లుక్‌పై పాజిటివ్ వైబ్స్‌ను క్రియేట్ చేయగా తాజాగా సురభి దాస్ చెప్పిన విషయాలు అభిమానుల్లో ఉత్కంఠను మరింత పెంచాయి.

శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తోన్న ఈ సినిమా భారతీయ సినీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

ఒక నటుడు తన పాత్రలో ఎంతగా లీనమైతే? సెట్‌లోని తోటి నటీనటులు కూడా అంతటి ఆశ్చర్యానికి లోనవుతారో చెప్పడానికి సురభి దాస్ మాటలే నిదర్శనం. అలాగే సినిమాలో రణబీర్ కపూర్ – సాయి పల్లవిల మధ్య కెమిస్ట్రీ కూడా అద్భుతంగా పండనుందని సురభి దాస్ హింట్ ఇచ్చారు. వీరిద్దరూ ఆయా పాత్రల కోసం ప్రాణం పెట్టి నటిస్తున్నారని, సెట్‌లో వారి మధ్య జరిగే సంభాషణలు మరియు భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఒక సరికొత్త లోకానికి తీసుకెళ్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965